అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

ఆదివారం 23 మార్చి 2025 పేజీలు : 04

నాడు మా బెడ్‌రూమ్‌లోకి వస్తామన్నారు

- నేడు మీ బెడ్‌రూమ్‌లో ఉండలేకున్నారు

- అక్రమ కట్టడాలను కూల్చడం ఖాయం
- 15 రోజులు గడువులోపు అక్రమ కట్టడాలను తొలగించుకోండి
- నిన్న జరిగిన అల్లర్లకు పోలీసుల వైఫల్యమే కారణం
- అది చేయకు ఇది చేయకు అని చేతులు కట్టేయకండి
- మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి

ఆర్డీఓ కేశవనాయుడుతో మాట్లాడుతున్న జె.సి

తాడిపత్రిటౌన్, మార్చి 22 ప్రభాతవార్త

నాడు వైసిపి ప్రభుత్వం అధికారంలో వుందని మా ఇళ్లల్లోకి చొరబడి మా బెడ్‌రూమ్‌లోకి వస్తామని నేడు అధికారం మారగానే వాళ్ల బెడ్‌రూమ్‌లో వుండడానికి జంకుతున్నారని వైకాపా నాయకులను ఉద్దేశించి తాడిపత్రి మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం తాడిపత్రి తహశీల్దార్ కార్యాలయానికి అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు వచ్చారన్న సమాచారంతో మున్సిపల్ చైర్మన్ తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. తాడిపత్రి పట్టణంలోని వైకాపా నాయకులు చేపట్టిన అక్రమ కట్టడాలపై ఆర్డీఓకు జె.సి ప్రభాకర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకునేందుకు 15 రోజులు గడువు ఇస్తున్నట్లు అధికారులను హెచ్చరించారు. అనంతరం జె.సి నివాసంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వైకాపా నాయకుల అక్రమ కట్టడాలపై జె.సి మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటి కట్టడంపై మరోసారి ధ్వజమెత్తారు. మాజీ ఎమ్మెల్యే నివాసంతో పాటు వైకాపా రాష్ట్ర నాయకుడు రమేష్‌రెడ్డి భవనాలు, మైనార్టీ నాయకుడు ఫయాజ్‌బాష ఇళ్లు, గాంధీకట్ట సమీపంలోని అంబటి రాఘవరెడ్డి నిర్మిస్తున్న భవనం, పుట్లూరు రోడ్డులో నిర్మిస్తున్న ఆకుల నాగిరెడ్డి భవంతిని మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా కట్టడాలు చేపట్టారని వాటన్నింటిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుని తొలగిస్తామని హెచ్చరించారు. విజయసాయిరెడ్డి ఇంటి గోడలనే కూల్చేశారు మీది కూల్చడం మా మున్సిపాలిటీకి సామాన్యమైన విషయమే అని అన్నారు. అన్ని అధికారికంగానే చేస్తాం రూల్స్ తెలుసు రూల్స్ ఫాలో అవుతూ మేము ముందుకు వెళ్తామని ఫయాజ్‌బాషకు పలుమార్లు మున్సిపాలిటీ అధికారులు నోటీసులు ఇచ్చినా స్పందన లేకపోవడంతో ఫయాజ్‌బాష ఇంటి వద్దకు నేను వెళ్లాల్సి వచ్చిందన్నారు. అక్కడ నేను లేకపోతే పరిస్థితి మరోలా వుండేదని, నిన్న కేవలం పోలీసుల వైఫల్యం వల్లనే ఇంత రాద్ధాంతం జరిగిందన్నారు. ఇష్టానుసారంగా నిర్మాణాలు చేబడితే మున్సిపాలిటీ అధికారులు చూస్తూ ఊరుకోరన్నారు. అది చేయకూడదు ఇది చేయకూడదు అని పైనుండి మా చేతులను కట్టిపడేస్తున్నారని ఇకమీద ఎవరి మాట వినమని మాకు జరిగిన అవమానం మీకు జరిగితే మీరు ఇలాగే మాట్లాడుతారా అని అధిష్టానాన్ని ప్రశ్నించారు. అయ్యా చంద్రబాబు గారు నేను నా కొడుకు జైలు గోడల మధ్య గడిపిన జీవితం గుర్తు తెచ్చుకుంటే ఆ పరిస్థితి జీవితంలో ఎవరికీ రాకూడదనిపిస్తుందన్నారు. మాకు జరిగిన అన్యాయాన్ని గమనించండి దయచేసి అది చేయకు ఇది చేయకు అని చెప్పకండి అని అంటూ అధిష్టానానికి చురకలు వేశారు. మాజీ ఎమ్మెల్యేను ఉద్దేశించి ఏ పార్టీ వచ్చినా రాజకీయలు చేస్తా అన్నావ్, ఫ్యాక్షన్ చేస్తా అన్నావ్, ఇప్పుడు ఎక్కడికి వెళ్ళావ్ మీడియా ముఖముగా ఛాలెంజ్ చేస్తున్న రా తాడిపత్రికి దమ్ముంటే అని జె.సి ఛాలెంజ్ చేశారు. కోమటికుంట్లలో 45 ఎకరాలు భూములు కొట్టేసినావని, దాని చరిత్ర బయటకు తీసి నీ లెక్క తేలుస్తానన్నారు. సోమవారం నుండి ఎవరెవరు అక్రమ నిర్మాణాలు చేపట్టారో వారందరి కట్టడాలను రూల్స్ ప్రకారమే కూల్చి వేస్తామన్నారు. గత ప్రభుత్వంలో పోలీసులు మా మీద కక్ష సాధింపులు చర్యలు చేశారన్నారు. ఈరోజు వారందరూ ఎక్కడికి వెళ్లారన్నారు. అయ్యా చంద్రబాబునాయుడు మీరు అన్ని గమనించండి అని జె.సి పేర్కొన్నారు.

వేగం పుంజుకున్న హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు..!

- రూ.696 కోట్లతో మల్యాల నుండి జీడిపల్లి వరకు కాలువ వెడల్పు - 3,850 క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు కానున్న ప్రధాన కాలువ

- ఉరవకొండ ప్రాంతంలో శరవేగంగా జరుగుతున్న పనులు - 3 నెలల్లో పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం

చిన్నముష్టూరు గ్రామంవద్ద హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు జరుగుతున్న దృశ్యం. వెడల్పు అవుతున్న హంద్రీనీవా ప్రధాన కాలువ

ఉరవకొండ, మార్చి 22 ప్రభాతవార్త

హంద్రీనీవా ప్రధాన కాలువ వెడల్పు పనులు చకచకా కొనసాగుతున్నాయి. 696 కోట్ల రూపాయలు వ్యయంతో కర్నూల్ జిల్లా మల్యాల వద్ద నుండి ఉరవకొండ నియోజకవర్గంలోని బెలుగుప్ప మండలం జీడిపల్లి జలాశయం 216వ కిలోమీటరు వరకు కాలువ వెడల్పు పనులు జరుగనుండగా ఉరవకొండ ప్రాంతంలో పనులు వేగం పుంజుకున్నాయి. రాగులపాడు లిఫ్ట్ ప్రాంతం నుండి భారీ యాంత్రాలతో కాలువలోని పూడికను, మట్టిను తొలగించి వెడల్పు చేస్తున్నారు. అదే క్రమంలో 216 కిలోమీటరు నుండి 400 కిలోమీటరు వరకు 936.7 కోట్ల రూపాయల వ్యయంతో లైనింగ్ పనులు సైతం ఇదివరకే ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ పనులు మూడు నెలల్లో పూర్తి చేయాలని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే...

శ్రీశైలం జలాశయం నుండి వరద నీటిని మళ్లించి రాయలసీమ జిల్లాల్లోని కరువు పీడిత ప్రాంతాల్లోగల వందలాది గ్రామాల్లోని లక్షలాది మంది ప్రజలకు తాగునీటిని, 6 లక్షల ఎకరాలకు ముఖ్యంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో 3.45 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించాలని హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టును రూపకల్పన చేసిన విషయం తెలిసిందే. రాయలసీమకు వరప్రసాదిని అయిన హంద్రీనీవా ప్రధాన కాలువ ద్వారా గత 2012 సంవత్సరం నుండి నీళ్లు వస్తున్నాయి. అయితే ఇప్పటి వరకు మొదటి దశలోనే డిస్ట్రిబ్యూటరీ కాలువలు, పిల్ల కాలువల నిర్మాణం పూర్తి కాకపోగా ప్రభుత్వాలు వాటి పూర్తికు చర్యలు తీసుకోకుండా చెరువులకు నీటిని మళ్లించి చేతులు దులుపుకొంటుండటంతో కాలువ నీటిని తమ పంట పొలాలకు మళ్లించుకోవడానికి కరువు రైతులు వేలు, లక్షల రూపాయలు డబ్బులు వేచ్చిస్తూ భగీరథ యజ్ఞం చేస్తూనే వస్తున్నారు. అయితే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం హంద్రీనీవా కాలువను మల్యాల నుండి 216 కిలోమీటర్ల వరకు వెడల్పు చేయాలని, అక్కడి నుండి 400 కిలోమీటర్ల వరకు లైనింగ్ చేయాలని నిర్ణయించి టెండర్లు పిలిచి ఖరారు చేసి పనులను ప్రారంభించింది. కాలువ వెడల్పు పనుల్లో భాగంగా కాలువకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తి కావడంతో గత వారం రోజులుగా కాలువలో పూడిక, మట్టి తొలగింపు పనులు ఉరవకొండ ప్రాంతంలో చురుగ్గా కొనసాగుతున్నాయి.

డిస్ట్రిబ్యూటరీలు, పిల్ల కాలువల నిర్మాణం పూర్తి చేస్తేనే ప్రయోజనం:

అయితే కాలువను కేవలం 3,850 క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేయడం ద్వారా ఎలాంటి ప్రయోజనం ఉండదని కాలువలో అదనంగా నీరు పారదని హంద్రీనీవా జల సాధన సమితి, కమ్యూనిస్టు పార్టీలు చెబుతున్నాయి. కాలువను కనీసం 6,000 క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేసి డిస్ట్రిబ్యూటరీ, పిల్ల కాలువల నిర్మాణాన్ని పూర్తి చేస్తే నీరు పంట పొలాలకు చేరి రైతులకు ప్రయోజనం చేకూరుతుందని అంటున్నారు. లైనింగ్ పనుల కారణంగా భూగర్భ జలాలు పెరుగుదలకు ఆటంకం ఏర్పడుతుందని నీరు భూమిలోకి ఇంకిపోదని చెబుతున్నారు. మల్యాల నుండి జీడిపల్లి వరకు హంద్రీనీవా ప్రధాన కాలువ సామర్థ్యాన్ని 1 టీఎంసీ (11574 క్యూసెక్కులు), జీడిపల్లి నుండి గొల్లపల్లి ఓటీ వరకు 6వేల క్యూసెక్కులకు, గొళ్లపల్లి నుండి మారాల వరకు 5వేల క్యూసెక్కులకు, మరాల నుండి చెర్లోపల్లి వరకు 4,500 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో కాలువను వెడల్పు చేయాలని కోరుతున్నారు. మడకశిర బ్రాంచి కెనాల్ ద్వారా 260 చెరువులకు నీళ్లు ఇవ్వాల్సి ఉండగా కేవలం 35 నుంచి 40 చెరువులకు మాత్రమే నీళ్లు వస్తున్నాయని మడకశిర బ్రాంచి కెనాల్‌ను 1500 క్యూసెక్కుల సామర్థ్యానికి వెడల్పు చేయాలని కోరుతున్నారు.

ఆర్థిక శాఖపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష

హాజరైన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఇతర ముఖ్య అధికారులు

ఉరవకొండ, మార్చి 22 ప్రభాతవార్త

రాష్ట్ర ఆర్థిక శాఖపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం హైదరాబాదులోని తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. సమీక్షకు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఇతర ముఖ్య అధికారులు హాజరయ్యారు. మరో వారం రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో ఆర్థిక శాఖలో స్థితిగతులపై చర్చించారు. కేంద్ర ప్రాయోజిత పథకాలు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై అధికారులతో రివ్యూ చేశారు. కేంద్రంలోని ఆయా శాఖల నుంచి రావాల్సిన నిధులు వచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్ర పథకాలకు సంబంధించి అవసరమైన సమగ్ర సమాచారాన్ని అందించి సకాలంలో నిధులు విడుదల అయ్యేలా చూడాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. కేంద్ర పథకాలకు సంబంధించి 5 శాఖల నిధులు రావాల్సి ఉందని అధికారులు తెలపగా కేంద్రంతో సంప్రదింపులు జరిపి ఆర్థిక సంవత్సరం ముగింపులోగా నిధులు తెచ్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్థికశాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్ హాజరవ్వగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, సిఎంవో అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

ఆర్థిక శాఖపై సమీక్ష నిర్వహిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. చిత్రంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

బూతులు తిట్టుకున్న బిజెపి నాయకులు

- రాష్ట్ర నేత ఎదుటే రచ్చరచ్చ - తీరు మారకపోతే సస్పెండ్ చేస్తానని హెచ్చరిక

హిందూపురం మార్చి 22 ప్రభాతవార్త

భారతీయ జనతా పార్టీ హిందూపురం నియోజకవర్గ నాయకుల మధ్య ఉన్న తీవ్ర విభేదాలు మరోసారి రచ్చకెక్కాయి. ఆ పార్టీ రాష్ట్ర ముఖ్య నేత ఎదుటే స్థానిక నాయకులు బూతులు తిట్టుకోవడంతో ఖంగుతిన్న సదరు నేత ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. తీరు మార్చుకోకపోతే కారకులందరినీ పార్టీ నుంచి పక్కకు పెడతామని (సస్పెండ్) వార్నింగ్ ఇవ్వడం ఆ పార్టీ వర్గాల్లో సంచలనం కలిగించింది. వివరాలు ఇలా ఉన్నాయి. సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో గురువారం భారతీయ జనతా పార్టీ జిల్లా సమావేశాన్ని జిల్లా అధ్యక్షులు శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేయగా ముఖ్య అతిథిగా ఆ పార్టీ రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్ తో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్ర శివన్నారాయణ పాల్గొన్నారు. జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో ముఖ్యమైన నాయకులతోపాటు ద్వితీయ శ్రేణి నాయకులను కూడా సమావేశానికి ఆహ్వానించారు. పార్టీ కార్యాలయంలో ఉదయం జరిగిన కోర్ కమిటీ సభ్యుల సమావేశం తర్వాత మధ్యాహ్నం హిందూపురం నియోజకవర్గ సమావేశం నిర్వహిస్తామని, అందరూ కచ్చితంగా ఉండాలని మధుకర్ స్థానిక నాయకులకు స్పష్టం చేశారు. చాలాకాలంగా హిందూపురం నాయకుల్లో ఉన్న విభేదాలను పరిష్కరించి సమన్వయం చేసేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్ రెడ్డి, పార్టీ ఎన్నికల జిల్లా సహాయఅధికారి మేడికుర్తి హరి, పార్లమెంట్ కన్వీనర్ రమణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి బడబాగ్ని అమర్, హిందూపురం పార్టీ అధ్యక్షురాలు, మున్సిపల్ కౌన్సిలర్ అంజలి రమేష్ రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు రవితేజ రెడ్డి, పార్టీ ఓబిసి విభాగం గొర్రెల పెంపకం దారుల రాష్ట్ర కన్వీనర్, కురుబ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.వి.చలపతి, పార్థసారథి, ఆదర్శ్ తదితరులు హాజరయ్యారు. సమావేశం ప్రారంభం అయిన వెంటనే మధుకర్ మాట్లాడుతూ మీ మధ్య గతంలో నెలకొన్న విభేదాలన్నీ మరచిపోయి పార్టీ కోసం సమన్వయంతో పని చేయాలని సూచించారు. నేను 20 ఏళ్ల ఇండస్ట్రీ, థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీ అంటూ పార్టీలో సీనియర్లమని పెత్తనం చేయరాదని కొత్త వారిని కూడా ప్రోత్సహించి వారితో కలసి పనిచేయాలని సూచించారు. ఇంతలో కె.వి చలపతి మాట్లాడుతూ ఇక్కడ సమావేశం ఏర్పాటు చేసింది మేము చెప్పే సమస్యలు వినేందుకా.. లేకపోతే మీరు చెప్పేది వినేందుకేనా అంటూ మధుకర్ ను ప్రశ్నించినట్టు తెలిసింది. అంతేకాకుండా జిల్లా అధ్యక్షుడు శేఖర్ వల్లే ఇలాంటి పరిస్థితులు తలెత్తాయని ఆరోపించడంతో ఒకసారిగా సమావేశంలో వాతావరణం మారిపోయింది. ముఖ్య నేతలను ఏకవచనంతో చలపతి సంబోధించడంపై రమేష్ రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ వాగ్వాదానికి దిగినట్లు తెలిసింది. రమేష్ రెడ్డి, చలపతి బూతులు తిట్టుకున్నట్లు సమాచారం. ఒక దశలో తోపులాట కూడా జరిగినట్టు తెలిసింది. గతంలో సన్నిహితంగా ఉన్న ఈ ఇద్దరు నాయకుల మధ్య తలెత్తిన స్వల్ప విభేదాలను తమకు అనుకూలంగా మలుచుకొని కొందరు కావాలనే చిచ్చు రగిల్చారని అందుకే ఈ ఇద్దరి మధ్య మరోసారి ఘర్షణ జరిగినట్లు కార్యకర్తలు పేర్కొంటున్నారు. పార్టీ హిందూపురం పట్టణ అధ్యక్షురాలిగా అంజలి రమేష్ రెడ్డి ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నిక కావడాన్ని జీర్ణించుకోలేక కొందరు స్థానిక నాయకులు దీనిని అడ్డుకోవాలని యత్నించి విఫలమైన విషయం తెలిసిందే. దీంతో సదరు వ్యక్తులు చలపతిని ప్రేరేపించి ఘర్షణ జరిగేలా కారణమయ్యారని విమర్శలు వస్తున్నాయి. అంటే.. ఒకరిని నేరుగా ఎదుర్కోకుండా మరొకరి భుజంపై తుపాకీ ఎక్కుపెట్టి షూట్ చేయాలని ప్రయత్నించి డబుల్ గేమ్ ఆడటంతో అది విఫలమైనట్లు పార్టీ కార్యకర్తలు పేర్కొంటున్నారు. తన ముందే హిందూపురం నాయకులు కీచులాడుకోవడాన్ని చూసి కంగుతిన్న మధుకర్ తీవ్రంగా స్పందించారు. ఏపీలో 954 కమిటీలలో మీదే పెద్ద పంచాయతీ అయింది నాకు. మాకు వేరే పని లేద..? మీ తీరు మారకపోతే పార్టీ నుంచి పక్కకు పెడతాం.. సస్పెండ్ చేస్తామని గట్టిగా వార్నింగ్ ఇచ్చినట్టు తెలిసింది. అంతేకాకుండా హిందూపురంలో టిడిపి కి చెందిన ఎమ్మెల్యే కార్యాలయం వద్ద కొందరు బిజెపి నాయకులు పొద్దున లేస్తేనే పడిగాపులు పడుతున్నట్టు తెలిసిందని.. ఎందుకిలా చేస్తున్నారని.. బిజెపి గౌరవాన్ని కాపాడేలా ఇకపై వ్యవహరించాలని సున్నితంగా మందలించినట్లు తెలిసింది. సమన్వయ సమావేశం రచ్చరచ్చ కావడంతో పార్టీ కార్యకర్తల్లో అయోమయం నెలకొంది. ముఖ్య నేత వార్నింగ్ తో నైనా హిందూపురంలో బిజెపి నాయకుల మధ్య విభేదాలు సద్దుమణుగుతాయా అన్నది ప్రశ్నార్థకమే.

ఎస్సీ వర్గీకర్ణపై ముఖ్యమంత్రి నిర్ణయం చారిత్రాత్మకం

అనంతపురం న్యూటౌన్, మార్చి 22 ప్రభాతవార్త

ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకం అని మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...దళితులు ఎస్సీ వర్గీకరణ కోసం దాదాపు 30 ఏళ్లుగా జరుగుతున్న పోరాటాన్ని ముఖ్యమంత్రి గౌరవించి ఎస్సీ వర్గీకరణ అంశాన్ని అసెంబ్లీలో తీర్మానం చేయడం చారిత్రాత్మకమన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం అనేక పోరాటాలు చేసినా ఏ పార్టీ పట్టించుకోలేదన్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు వచ్చిన తర్వాత వర్గీకరణ అమలు చేయడం వలన వేలాది మంది దళితులకు ఉద్యోగాలు వచ్చాయన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి దళితుల సంక్షేమం కోసం సానుకూలమైన నిర్ణయాలు తీసుకుంటుంటే...వైసీపీ నాయకులు, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ ముఖ్యమంత్రి దళితుల మధ్య చిచ్చు పెట్టడానికి ప్రయత్నిస్తున్నారని మాట్లాడటం అవగాహన రహిత్యమన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఉమ్మడి కార్పొరేషన్‌ను మాల, మాదిగ, రెల్లి మూడు కార్పొరేషన్లుగా విభన చేసిన వారికి ఎమంటారో, ఏమి అనుకోవాలని ప్రశ్నించారు. నిజంగా దళితుల పట్ల చిత్తశుద్ధి ఉంటే జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దళితుల కోసం ఏమి చేశారని ప్రశ్నించారు. దీనిపై వైసీపీ నాయకులు ఎవరైనా చర్చకు వస్తారా? అని సవాల్ విసిరారు. తెలుగుదేశం పార్టీ దళితులు కోసం ఏమి చేసిందో చర్చించడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దళితుల కోసం ఎన్ఎస్ఎఫ్‌డిసి స్కీం వద్దని కేంద్రానికి లేఖ రాశారని, ఆ తర్వాత టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్ఎస్ఎఫ్‌డిసి స్కీంను పునరుద్ధరించాలని లేఖ రాశారన్నారు. గత ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన నువ్వు గత ఐదేళ్లలో ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు ఎంత కేటాయించారో చర్చించడానికి సిద్ధమా అని ప్రశ్నించారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అసెంబ్లీలో మాట్లాడిన తీరును చూస్తే దళితుల పట్ల ఆయనకు ఉన్న వైఖరి స్పష్టమైందన్నారు. ఉమ్మడి కార్పొరేషన్‌ను ఎందుకు విభజించారో చెప్పాలన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు చేయడానికి ఏకసభ్య కమిషన్‌ను నియమించి, రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి అభిప్రాయాలు సేకరించి నివేదికను ప్రభుత్వానికి అందజేశారన్నారు. ఆ నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలుకు నిర్ణయం తీసుకుందన్నారు. ఇలాంటి నిర్ణయాలను స్వాగతించాల్సిన నువ్వు దళితుల మధ్య చిచ్చు పెట్టుతున్నారని అనడం అవివేకమన్నారు. గత ఐదేళ్లలో దళితులకు సంక్షేమ పథకాలను రద్దు చేస్తే అప్పుడేందుకు నోరు మొదపలేదని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ ఎన్నో పోరాటాలు చేశారన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలులో ఆయన పాత్ర చాలా ఉందన్నారు. దళితుల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయమన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు

ఐదు ఎకరాల లోపల ఉన్నటువంటి ప్రతి రైతు ఫారం పాండ్ ఏర్పాటు చేసుకోవాలి

- లక్ష్యాలను చేరుకునే విధంగా అధికారులు కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్.

ఫారం పాండ్లకు భూమి పూజ చేస్తున్న కలెక్టర్ తదితరులు

కూడేరు, మార్చి 22 ప్రభాతవార్త

ప్రపంచ జల దినోత్సవంలో భాగంగా శనివారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద కూడేరు మండలం చోళ సముద్రం గ్రామానికి చెందిన రైతు ఎర్రిస్వామి పొలంలో ఫారం పాండ్ ఏర్పాటుకు సంబంధించి భూమి పూజ పనులను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. చోళ సముద్రం గ్రామానికి మొత్తం 21 ఫారంపాండ్‌లకు అనుమతి లభించాయని, వీటిలో మూడు పనులను పూర్తి చేయడం జరిగిందని, 7 పనులు వివిధ దశలలో పనులు జరుగుతున్నాయని, 11 పనులను ప్రారంభించవలసి ఉన్నాయని తెలిపారు. ఐదు ఎకరాలలోపల ఉన్నటువంటి ప్రతి రైతు ఫారం ఫండ్స్‌ను ఏర్పాటు చేసుకోవాలని, అదే విధంగా ప్రతి రైతుకు అవగాహన కల్పించి వారు ఏర్పాటు చేసుకునే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. అంతేకాకుండా 5ఎకరాల కంటే తక్కువ ఉన్న వారికి కూడా ఫారంపాండ్స్ ఏర్పాటుకు ముందుకు వస్తే వారు ఏర్పాటు చేసుకునే దానికి వీలుగా అనుమతులు తీసుకొని ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. రైతులతో ఫారంపాండ్ల ఉపయోగాలు, అభిప్రాయాలను కూడా అడిగి తెలుసుకున్నారు. ఈ విషయమై రైతులు మాట్లాడుతూ.. ఈ ప్రాంతమంతా పల్లపు ప్రాంతం కావడం వర్షాకాలంలో వర్షపునీరు వృధాగా పోకుండా నీటి నిలువలు చేయుటకు ఉపయోగపడుతుందని, అలాగే బోర్లలో నీటి శాతం వృద్ధి బోర్లు రీఛార్జ్ అయ్యేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామంలో ఉన్నటువంటి ప్రజాప్రతినిధులు, అధికారులు అందరూ కలిసి ప్రజల్లో అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ ఉపయోగించుకునే విధంగా చూడాలని, ప్రతి నీటి బొట్టును వృధా కాకుండా ఒడిసిపట్టి వినియోగించుకునే విధంగా చూడాలని, ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేసుకునే విధంగా అధికారులంతా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, డ్వామా పిడి సలీమ్ బాషా, తహశీల్దార్ మహబూబ్ బాషా, ఎంపీడీవో కుళ్లాయి స్వామి, ఈఓఆర్డి రాధాకృష్ణ, ఏపీఓ తులసి ప్రసాద్, సెక్రటరీ సుభాషిని, సర్పంచ్ రమాదేవి, మండల టీడీపీ కన్వీనర్ మురళి, తదితర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సహజ వ్యవసాయంతోనే ఆరోగ్య భద్రత : రిటైర్డ్ కలెక్టర్ జనార్దన్ రెడ్డి

కేక్ కట్‌చేస్తున్న దృశ్యం, సమావేశం లో మాట్లాడుతున్న రిటైర్డ్ కలెక్టర్ జనార్ధనరెడ్డి విజయరామ్

అనంతపురం వ్యవసాయం, మార్చి22, ప్రభాతవార్త

ప్రస్తుత కాలంలో పెరుగుతున్న ఆరోగ్య సమస్యల ను తగ్గించడానికి;సహజ వ్యవసాయ పద్ధతులు, పాటించడం ద్వారా, స్థానిక రకాలు పంటలను సాగు చేయడమే ఏకైక పరిష్కార మార్గమని పలువురు వక్తులు అభిప్రాయపడ్డారు. శనివారం అనంతపురంలోని పోలీస్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటుచేసిన మన వ్యవసాయం పంటలు వంటకాలు ఆరోగ్యం అనే మూడు రోజులు పాటు జరిగే కార్యక్రమాన్నిమాజీ రిటైర్డ్ కలెక్టర్ బి జనార్దన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ కలెక్టర్ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక నేలలకు అనుకూలమైన పంటలు పండించడమే కాకుండా పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు స్థానికంగా పండించిన వాటిని తినాలని కోరారు. అనంతరం అనంతపురంలోని సుభాష్ పాలేకర్ సహజ సాగు సూత్రాలను అనుసరించి ఎకరాకి మూడు లక్షల నుంచి ఆరు లక్షల వరకు ఆర్థిక భద్రత కల్పించాలని ప్రకృతి వ్యవసాయ స్వాతంత్ర ప్రచారకర్త విజయరామ్ పిలుపునిచ్చారు. సుభాష్ పాలేకర్ నేచురల్ ఫార్మింగ్ ఎస్ పి ఎన్ ఎస్ సూత్రం భారతదేశంలోని 45 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూర్చిందని పెట్టుబడి రహిత పద్ధతిలో సాగు చేయడానికి రైతులు స్వచ్ఛందంగా సహాయ పడాలనే తన ఉద్దేశాన్ని ఆయన వివరించారు. ఏ ఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ వైవి మల్లారెడ్డి మాట్లాడుతూ ఈ మిల్లెట్స్ మేళా నేపథ్యాన్ని సందర్భాన్ని క్లుప్తంగా రైతులకు వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా రైతు సమస్యలను ప్రజలకు ఎదురయ్యే ఆరోగ్య సమస్యలన్నింటికీ సహజ వ్యవసాయమే దివ్య ఔషధం అనే సందేశాన్ని అందించాలని ఆయన కోరారు. ప్రసిద్ధి చెందిన సోనామసూరి రకం వరి సాగును నిలిపివేయాలని రైతులను కోరుతూ ఎరువులు మరియు పురుగుమందులు వేయకుండా చిన్నంగ మరియు కోలాతేర్ రకాలను లేదా

ఐఈసి పోస్టర్లు మరియు ఫోమ్ బోర్డ్స్ విడుదల

రాయదుర్గం, మార్చి 22 ప్రభాతవార్త:

పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మరియు నివారణ విభాగం(దిశ) ఆదేశాల మేరకు ఐసిటిసి మరియు మాస్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సూపెర్డింటెంట్ డాక్టర్ మేర్సీ జ్ఞాన సుధ చేతుల మీదుగా ఐఈసి పోస్టర్లు మరియు ఫోమ్ బోర్డ్స్‌ను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మేర్సీ జ్ఞానసుధ మాట్లాడుతూ ఎచ్ఐవి/ఎయిడ్స్ పై అవగాహన కల్పిస్తూ హెచ్ఐవి ఎలా వస్తుంది, ఎలా రాదు, వచ్చిన వారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేశారు. అనంతరం ఐసిటిసి కౌన్సిలర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ నిశ్శబ్దాన్ని వీడి ప్రతి ఒక్కరూ హెచ్ఐవి పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. హెచ్ఐవితో జీవిస్తున్న వారిని వివక్షతకి గురిచేయకూడదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ మాధవి, అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ అజాహార్ ఖాన్, ఐసిటిసి కౌన్సిలర్ కృష్ణమూర్తి, అల్తాఫ్, ప్రాజెక్ట్ మేనేజర్ నీలకంఠ, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నెల వారీ సమీక్షా సమావేశం నిర్వహించిన వైద్యాధికారి రాజేశ్ కుమార్

కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ రాజేష్ కుమార్

బ్రహ్మసముద్రం.మార్చి 22 ప్రభాతవార్త

బ్రహ్మసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందితో నెలవారీ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారి సిబ్బంది యొక్క గత సంవత్సరం ఏప్రిల్ నుంచి ఈ సంవత్సరం మార్చి వరకు 12 నెలల వార్షిక ప్రగతి, రికార్డులు పరిశీలించారు. డాక్టర్ గారు మాట్లాడుతూ ఎన్.సీడీ సర్వే, ఆర్ సీ హెచ్ సర్వే వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. అదే విధంగా ఇప్పుడు వేసవికాలం కాబట్టి వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించాలని , ఉపాధిహామీ కూలీల దగ్గరకు ఉదయాన్నే వెళ్ళి వడదెబ్బ తగలకుండా ఉండాలంటే ఏమేమి జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వారికి సరఫరా చేయాలని సూచించారు. ఏదైనా ముఖ్యమైన పని ఉంటేతప్ప ఉదయం 10గంటల నుండి సాయంత్రం 4 గంటల మధ్యలో బయట ఎండలో తిరగ కూడదని చెప్పారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన రాణి ఎస్తేర్ గారికి పీహెచ్‌సీ సిబ్బందికి పరిచయంచేశారు. సీహెచ్‌వో మాట్లాడుతూ కర్నాటక సరిహద్దు మారుమూల ప్రాంతానికి బదిలీపై వచ్చానని ఈ ప్రాంత గ్రామీణ ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నానని అదే విధంగా సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలు సకాలంలో పూర్తి చేయాలని ఏ విధమైన సందేహాలు ఉన్నా తనకు చెప్పాలని, అందరికీ అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించి పీహెచ్ సీ మంచి పేరు తీసుకుని రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ మేరి సూపర్ వైజర్ రామలక్ష్మి ఎంఎల్ హెచ్‌పీలు, ఎఎన్ఎమ్ పాల్గొన్నారు.

రీ సర్వే పై అవగాహన ర్యాలీ

గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీవో వసంతబాబు

కంబదూరు, మార్చి 22, ప్రభాతవార్త

మండల పరిధిలోని ములకనూరు గ్రామంలో శనివారం రెండో విడత రీ సర్వేలో భాగంగా కళ్యాణదుర్గం ఆర్డీవో వసంత బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం రీ సర్వే అని పేర్కొన్నారు. కావున ప్రతి ఒక్క రైతు రీ సర్వే పై అవగాహన కలిగి ఉండి భూ సమస్యలను

రీ సర్వే పై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పరిష్కరించుకోవాలని సూచించారు. రైతుల భూముల్లో రీ సర్వే చేపట్టేముందు సంబంధిత రైతులకు ముందుగా సమాచారం ఇవ్వాలని అధికారులకు ఆర్డిఓ తెలియజేశారు.అనంతరం ఆ గ్రామంలో రెవెన్యూ అధికారులు ప్రత్యేక ర్యాలీ నిర్వహించి రీ సర్వే గూర్చి రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ బాలకిషన్, డివిజినల్ సర్వేయర్ సూర్యనారాయణ రెడ్డి, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ గణేష్, రెవెన్యు ఇన్స్పెక్టర్ నాగరాజు,సర్వే యర్ శ్రీనివాసులు , వీఆర్వో రమేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ జల దినోత్సవం

బెలుగుప్ప, మార్చి 22 ప్రభాతవార్త

ఫారం పాండ్లకు భూమిపూజ చేస్తున్న అధికారులు నాయకులు

బెలుగుప్ప మండల కేంద్రంలో శనివారం ఘనంగా ప్రపంచ జల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు నీటి సంరక్షణ, వన సంరక్షణ అనే నినాదంతో ఎంపిడిఓ లక్ష్మినారాయణ, జిల్లా కార్యదర్శి బి.మల్లికార్జున, మాజీ వైస్ ఎంపిపి తిమ్మప్ప, రాధకృష్ణ, వెంకటనాయుడులు నీటి సంరక్షణ కోసం ఫారంపాండ్లకు భూమిపూజ నిర్వహించారు. మండలవ్యాప్తంగా సర్పంచులు, ఎంపిటిసిలు, ఆయా గ్రామాలలో జల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, నాయకులు మాట్లాడుతూ.. నీటి ఆవస్యకతను, ఫారం పాండ్ల ద్వారా కూలీలకు క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ మురళీకృష్ణ, ఇసి రామకృష్ణ, టెక్నికల్ అసిస్టెట్లు నాగేంద్ర, విజయ్, ఉపాధిహామీ సిబ్బంది, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక స్పీకర్ కు సన్మానం

హిందూపురం మార్చి 22 ప్రభాతవార్త



స్పీకర్‌ను సన్మానిస్తున్న శ్రీధర్, గంగాధర్

కర్ణాటక రాష్ట్రం మంగళూరులో సాదుచెట్టి సంఘం ఆధ్వర్యంలో నిర్మితమవుతున్న శ్రీ వారియమ్మ దేవాలయం కోసం కర్ణాటక అసెంబ్లీ స్పీకర్, మంగళూరు ఎమ్మెల్యే ఖాదర్ ప్రభుత్వం తరఫున రూ. 50 లక్షలు విరాళంగా ఇవ్వడం జరిగింది, ఇందుకు తమ వంతుగా కృషి చేసిన హిందూపురం సాదు చెట్టి సంఘం ఉపాధ్యక్షులు జి.సి.శ్రీధర్ మరియు ప్రియా గంగాధర్, సెల్వరాజ్, మైసూర్ శివప్ప, బెంగళూరు మణి కర్ణాటక అసెంబ్లీ ఆవరణలో స్పీకర్ ఖాదర్ ని కలిసి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మంగళూరు చెందిన కుల సంఘం పెద్దలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

వైద్య శిబిరంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ తదితరులు

హిందూపురం టౌన్ మార్చి 22 ప్రభాతవార్త

హిందూపురం పట్టణంలోని వాల్మీకి కళ్యాణ మండపంలో బెంగళూరుకు చెందిన ఎమ్మెస్ రామయ్య హాస్పిటల్ యోగి నారాయణ సేవా సమితి సంయుక్తంగా శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు వైద్య శిబిరంలో 430 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు ఎమ్మెల్యే బాలకృష్ణ సౌజన్యంతో రోగులకు ఉచితంగా మందులు అందజేశారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డి,ఇ రమేష్ కుమార్, ఎమ్మెల్యే పి,ఎ బాలాజీ, జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ ఆకుల ఉమేష్, సద్గురు శ్రీ యోగి నారాయణ సేవా సమితి అధ్యక్షులు రవికుమార్, రాజ్యలక్ష్మి మోహన్ పాల్గొన్నారు.

నేడు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పగడాల మల్లికార్జున

కళ్యాణదుర్గం, మార్చి 22 ప్రభాతవార్త

కళ్యాణదుర్గం పట్టణములోని లిటిల్ రోజెస్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 23వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు లయన్స్ క్లబ్, పుష్పగిరి కంటి వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు పగడాల మల్లికార్జున తెలిపారు. కంటి శుక్లాలు ఉన్న రోగులను గుర్తించి వారికి ఉచిత ప్రయాణ సౌకర్యంతో పాటు ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించి కంటి అద్దాలను కూడా ఉచితంగా అందజేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంత పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కెజిబివిల్లో దరఖాస్తులు చేసుకోండి

బెలుగుప్ప, మార్చి 22 ప్రభాతవార్త

బెలుగుప్ప మండలకేంద్రంలో కెజిబివి ప్రిన్సిపాల్ నాగరత్నభాయ్ ప్రభుత్వం రాష్ట్ర సమగ్ర శిక్షణ ఎస్‌పిడి బి.శ్రీనివాసులు ఆదేశాల మేరకు 6, 11 తరగతులకు విద్యార్థినీలు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ. మండలంలో పేద, బడిమానేసిన విద్యార్థినీలు, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలు 6, 11 తరగతులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 7, 8, 9, 10, 12కు సంబంధించిన ఖాళీల్లో విద్యార్థినీలను మార్చి 22 నుంచి ఏప్రిల్ 11 వరకు దరఖాస్తులను ఆన్‌లైన్ చేసుకోవాలని తెలిపారు.

ఆర్ఎంపి డాక్టర్‌పై విచారణ చేపట్టి క్రిమినల్ కేసులు నమదు చేయాలి

విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్.

సీఐకు వినతిపత్రం అందిస్తున్న విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు.

రాయదుర్గం రూరల్, మార్చి 22 ప్రభాతవార్త:

గుమ్మఘట్ట మండల పరిధిలోని గలగల గ్రామానికి చెందిన మూడేళ్ల చిన్నారి జ్వరం రావడంతో తల్లిదండ్రులు మూసా క్లినిక్‌లో వైద్యం చేయించారని, అయితే ఆర్ఎంపి డాక్టర్ వైద్యం వికటించి మూడేళ్ల చిన్నారి మృతి చెందిందని, దీనికి కారకులైన ఆర్ఎంపి డాక్టర్ పై విచారణ చేపట్టి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సిపిఐ, సిపిఎం, ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో సీఐ జయనాయక్‌ను వారు కలిసి వినతిపత్రం అందించారు. అనతరం వారు మాట్లాడుతూ మూడేళ్ల చిన్నారికి ఆ వైద్యుడు బ్లెడ్ టెస్ట్ చేసిన అనంతరం టైఫాయిడ్ జ్వరం ఉందని, సెలైన్, ఇంజక్షన్లు వేయడంతో చిన్నారి అక్కడిక్కడే మృతి చెందిందని, ఆ చిన్నారికి తలకి జ్వరం ఎక్కుక్కిందని, ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని సూచిస్తే అప్పటికే ఆ చిన్నారి మృతి చెందిందని ప్రభుత్వ వైద్యులు చిన్నారి తల్లిదండ్రులకు తెలియజేశారన్నారు. తల్లిదండ్రులు బోరున విలపిస్తూ మూసా క్లినిక్ వద్ద ఆందోళన చేపట్టారని, వారికి మద్దతుగా సిపిఐ, ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ పార్టీల నాకులు నిలిచి దర్నా నిర్వహించడం జరిగిందని తెలిపారు. అదే విధంగా రాయదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా రాయదుర్గం, గుమ్మఘట్ట, కణేకల్లు, హీరేహాళ్ మండలాల్లో కొన్ని నెలల నుండి ప్రజలు చిన్నపిల్లలు, మహిళలు ఆర్ఎంపి డాక్టర్ల వైద్యం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. వీటిపైన విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఆర్ఎంపి డాక్టర్లు సైలెన్లు పెట్టడం, ఇంజక్షన్లు వేయడం పరిమితికి మించి వైద్యం చేయడం లాంటి పనులు చేయకూడదని పలుమార్లు వారికి చెప్పినా వారే ఒక ఎంబిబిఎస్ డాక్టర్ గా అన్ని రకాల వైద్యాలు వారి క్లినిక్‌లోనే చేసి ప్రజల ప్రాణాలు పోవడానికి కారకులవుతున్నారన్నారు. వారికి మెడిసెన్ ఎక్కడి నుండి వస్తుంది, ఎవరూ సప్లై చేస్తున్నారు. దాని పైన కూడా విచారణ చేపట్టాలని, ఆర్ఎంపిలను వైద్యం కట్టడి చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రి లేదా ఎంబిబిఎస్ చేసినటువంటి వైద్యులు దగ్గరికి ప్రజలని వెళ్లేలా అవగాహన పరచాలని పోలీసులు వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ, సిపిఐ, సిపిఎం నాయకులు కొట్రేష్, బంగి శివ, మల్లికార్జున, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పయ్యావుల సోదరుల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

హాజరై రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసిన పయ్యావుల విజయ్ సింహ

భోజనం వడ్డిస్తున్న పయ్యావుల విజయ్ సింహ

ఉరవకొండ, మార్చి 22 ప్రభాతవార్త

రంజాన్ ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలకు రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, టిడిపి సీనియర్ నేత పయ్యావుల శ్రీనివాసులు శనివారం సాయంత్రం ఉరవకొండలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. పట్టణంలోని 7

బీబీ జైనబ్బి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న పయ్యావుల విజయ్ సింహ

మసీదులలో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి మంత్రి పయ్యావుల కేశవ్ తనయుడు పయ్యావుల విజయ్ సింహ హాజరై ముస్లింలతో ఉపవాస దీక్షను విరమింప చేసిన అనంతరం వారికి విందు భోజనాన్ని స్వయంగా వడ్డించారు. అనంతరం ప్రసిద్ధ బిబి జైనబ్బి దర్గాను సందర్శించి అమ్మవారికి చాదర్, పూలమాలను సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ఉపవాస దీక్ష పరులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని 5 మండలాలకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. యుపిఎస్ సీఐ బి.మహానంది, రూరల్ సీఐ చిన్న గౌస్, కూడేరు సీఐ రాజు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

24న నిద్రగట్టలో రీ సర్వేపై గ్రామసభ

అమరాపురం మార్చి 22 ప్రభాతవార్త



తహసిల్దార్ లక్ష్మీనరసింహ

మండల పరిధిలోని నిద్రగట్ట గ్రామమునందు ఈనెల 24వ తేదీ గ్రామ సచివాలయం వద్ద ఉదయం 10 గంటలకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత గ్రామంలో రి సర్వే ప్రారంభమునకు గ్రామసభ మరియు ర్యాలీ నిర్వహించబడనని తహసీల్దార్ లక్ష్మీనరసింహం తెలిపారు. కావున ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలకు, నాయకులు, అధికారులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమం నందు రెవెన్యూ ఇన్స్పెక్టర్ విన్సెంట్ పాల్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

విష ద్రావకం తాగి 18 గొర్రెలు మృతి.

మూడు లక్షలు ఆస్తి నష్టం

కనగానపల్లి మార్చి 22 ప్రభాతవార్త

విషం ద్రావకం తాగి మృతి చెందిన గొర్రెలు

మండలంలోని వేపకుంట గ్రామానికి చెందిన గొర్రెల కాపరి కురుబ దివిటి ఈశ్వరయ్య చెందిన 18 గొర్రెలు విషం ద్రావకం తాగి మృతి చెందాయి. గొర్రెల కాపరి ఈశ్వరయ్య, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు గొర్రెల కాపరి దివిటీ ఈశ్వరయ్య శనివారం మేత మేపుకు తీసుకెళ్లి మధ్యాహ్నం సమయంలో అదేగ్రామానికి చెందిన ఓతోటలో పంటకు మందును డ్రిప్పు ద్వారా ఇవ్వడంతో మందు నీళ్లు నిల్వ ఉండడంతో గొర్రెలు తాగడంతో అపస్మారక స్థితిలో వెళ్లి 18 గొర్రెలు వెంటనే మృతిచెందాయి. దాదాపు 3లక్షలనష్టం వాటిల్లిందని గొర్రెల కాపరిని ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని మద్దులచెరువు ఎంపీటీసీ చిన్నచెరువన్న, టిడిపి నాయకులు బంగారు సూర్యనారాయణ గ్రామస్తులు కోరారు.

ఎస్సీ వర్గీకరణ చట్ట బద్ధత పట్ల హర్షం వ్యక్తం చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులు.

రొద్దం. మార్చి 22 ప్రభాతవార్త.

మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు ఎమ్మార్పీఎస్ కూటమి నాయకుల ఆధ్వర్యంలో పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ సందర్భంగా కూటమి నాయకులు రొద్దం నరసింహులు నీరుగంటి వేణుగోపాల్ మాట్లాడుతూ మూడు దశాబ్దాల నిరంతర పోరాటానికి ఈనాడు న్యాయం లభించింది ఎస్సీ వర్గీకరణ సాధన సందర్భంగా ఎంతోమంది మాదిగల పోరాట ఫలితమే ఈనాడు ఏబిసిడి వర్గీకరణ జరిగి మాదిగలకు న్యాయం జరిగిందని 30 ఏళ్లుగా జరిగిన ఉద్యమాన్ని గుర్తు చేసుకున్నారు అనేక అవమానాలు ప్రాణ త్యాగాలు తర్వాత ఈ విజయం సాధ్యమైందన్నారు ఈ పోరాటంలో అమరులైన వారిని స్మరించుకుంటూ వారికి జోహార్లు అర్పించారు మంద కృష్ణ మాదిగ పోరాట స్ఫూర్తి కి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చి ఎస్సీ వర్గీకరణ అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించినందుకు రుణపడి ఉంటామనిఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని తీసుకున్నందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ ఈరోజు పండుగ వాతావరణం నెలకొందని దీనికి కారణమైన మందకృష్ణ మాదిగ కు పోరాటం చేసిన అమరులకు ధన్యవాదాలు తెలియ చేశారు ఈ కార్యక్రమంలో ఈ పవన్ కుమార్ మహదేవన్లింగప్ప సిద్దన్న రాజు బైలంజి చిన్న గోపాల్ టైలర్ శంకర్ మారుతి నరసింహులు జయప్ప వెంకటేశులు తదితరులు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు

జాతీయ U10 ఆర్చరీ పోటీలకు అనంతపురం క్రీడాకారులు ఎంపిక

అనంతపురం కల్చరల్, మార్చి 22 ప్రభాతవార్త

జాతీయ U10 ఆర్చరీ పోటీలకు అనంతపురం క్రీడాకారులు ఎంపిక అయ్యారు. ఈ నెల 23, 24న గుంటూరులోని ఆచార్య నాగార్జునయూనివర్సిటీలో జరిగే నేషనల్ ఆర్చరీ పోటీలకు జిల్లాలోని ఎంకే స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న సాధ్విన్, ప్రజ్ఞ తేజ, తరునిక, జస్మిత, మాన్విత, మాన్య ప్రాతినిధ్యం వహించనున్నారు. ఎంపికైన క్రీడాకారులను స్పోర్ట్స్ అకాడమీ హెడ్‌కోచ్ రాహుల్‌బాబు అభినందించారు.

అంగన్వాడీలకు పిల్లలుపోషణ, నూతన విద్య పై శిక్షణ

కొత్తచెరువు మార్చి 22 ప్రభాతవార్త

ఆరు సంవత్సరాలు వయస్సు కంటే తక్కువ వయస్సు గల చిన్నారుల అభివృద్ధిని నిర్ధారించడానికి నూతన విద్యా విధానం ద్వారా విద్యాభ్యాసం అందించాలని సిడిపిఓ గాయత్రి పేర్కొన్నారు కొత్తచెరువు మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో పుట్టపర్తి ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడి కార్యకర్తలకు మూడు రోజులు పాటు పోషణ భీ పడాయి భీ శిక్షణ కార్యక్రమాన్ని ఐసిడిఎస్ సూపర్వైజర్ పుష్పలత ఆధ్వర్యంలో నిర్వహించారు మూడవ రోజు శనివారం ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పుట్టపర్తి ప్రాజెక్ట్ సిడిపిఓ గాయత్రి విచ్చేశారు ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ విద్యార్థులకు నాణ్యమైన సూక్ష్మ పోషకాలు అందించేలా చర్యలు తీసుకోవాలి చిన్నారులు ఆ దశలో పెరుగుదల అధికంగా ఉంటుంది కాబట్టి ప్రతి కార్యకర్త పిల్లలు పట్ల ప్రత్యేక శ్రద్ధతో విద్యార్థులకు ప్రభుత్వ అందించే నాణ్యమైన పౌష్టికాహారాన్ని ఇవ్వాలి అంతేకాకుండా నూతన విద్యా విధానం ద్వారా ఆటపాటలతో విద్య నేర్చే విధానం , శ్యామ్ మ్యామ్, పిల్లల పెరుగుదల సూక్ష్మ పోషకాలు ఫీడింగ్,మానసిక ఆరోగ్య స్థితిగతులు మెరుగుపరచడం పై అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు

కెఎస్ ఆర్టీసీ బస్సులు కంబదూరులోకి వచ్చేలా చర్యలు తీసుకోండి

తహశీల్దార్‌కు అర్జిస్తున్న టిడిపి నాయకులు

కంబదూరు, మార్చి 22, ప్రభాతవార్త

కంబదూరు బైపాస్ మీదుగా కళ్యాణదుర్గం కు వెళ్తున్న కేఎస్ ఆర్టీసీ సర్వీస్ బస్సులను కంబదూరు ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు మీదుగా నడిపేలా చర్యలు తీసుకోవాలని శనివారం టిడిపి నాయకులు మండల తహశీల్దార్ బాలకిషన్ కు వినతిపత్రం సమర్పించారు. కర్ణాటక ఆర్టీసీ బస్సులు కంబదూరులోని ఆర్టీసీ బస్టాండ్, పోస్ట్ ఆఫీస్ గుండా నడపడం వలన ఎంతో మంది ప్రయాణికులు అనుకున్న సమయంలో గమ్య స్థానాలకు చేరుకుంటారని టిడిపి నాయకులు అర్జీలో పేర్కొన్నారు. ఇప్పటికే కె ఎస్ ఆర్ టి సి బస్సులను కంబదూరు లోపలికి వచ్చే విధంగా కె ఎస్ ఆర్ టి సి డ్రైవర్లతో మాట్లాడి తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని తహసీల్దార్ కు టిడిపి నాయకులు తెలియజేశారు. కేఎస్ఆర్టీసీ బస్సులు కంబదూరు లోపలికి రాకపోవడం వల్ల ఎంతోమంది వృద్ధులు, గర్భిణీ స్త్రీలు చాల దూరం వరకు చెక్‌పోస్ట్ సర్కిల్ కు నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని దీంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తహశీల్దార్ దృష్టికి వారు తీసుకెళ్లారు. కావున సమస్యను ఉన్నత అధికారులు తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు తహశీల్దార్ ను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీరాములు, గాజుల హనుమంత రాయుడు, ఆటో రాజు, కొత్తూరు మారుతీ, హనుమంతు, బాగే పల్లి రాజు, చరణ్, బాలు తదితరులు పాల్గొన్నారు.

27న ఎంపిపి ఎన్నిక

రామగిరి, మార్చి 22 ప్రభాతవార్త

రామగిరి మండల ప్రజా పరిషత్ అధ్యక్షుని ఎంపిక ఈనెల 27న జరగనున్నట్లు ఎంపిడిఓ చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి ఎన్నికకు ప్రత్యేక అధికారి సంజీవయ్య పర్యవేక్షణలో ఎన్నిక నిర్వహించడం జరుగుతుందన ఆనరు. రామగిరి ఎంపిపిగా ఉన్న నాగమ్మ గత ఏడాది డిసెంబర్ 30న మృతి చెందారు. దీంతో ప్రస్తుతం వైస్ ఎంపిపిగా ఉన్న కరెన్న ఇన్‌చార్జ్‌గా ఎంపిపిగా బాధ్యతలు వ్యవహరిస్తున్నారు. ఈ నెల 27న నూతన ఎంపిపిని ఎన్నుకోనున్నారు. జనరల్ మహిళలకు ఎంపిపి రిజర్వుగాఉంది. ఎన్నికల 27 ఉదయం 10 గంటలకు నామినేషన్ స్వీకరణతో ప్రారంభమవుతుందన్నారు.

క్రమశిక్షణతో కూడినటువంటి విద్యకు జీవితంలో మంచి గుర్తింపు లభిస్తుంది

ధర్మవరం రూరల్ మార్చి 22 ప్రభాతవార్త

క్రమశిక్షణతో కూడినటువంటి విద్యకు జీవితంలో మంచి గుర్తింపు లభిస్తుందని పట్టణ ప్రముఖులు సంధా రాఘవ, ఎంఈఓలు రాజేశ్వరి దేవి, గోపాల్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని పుట్టపర్తి రోడ్ సాయి నగర్ లో గల షిరిడి సాయిబాబా కళ్యాణ మండపంలో శ్రీ సాయి విట్టరీ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ 14వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు బాల బాలికలు అని తేడా లేకుండా అందరినీ చదివించాలని, ప్రభుత్వము కూడా విద్య విషయంలో అనేక సంక్షేమ పథకాలను అందిస్తోందని తెలిపారు. క్రమశిక్షణ, తపన, లక్ష్యం లాంటి వాటిని ప్రతి విద్యార్థి లక్ష్యంగా చేసుకోవాలని తెలిపారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ఉన్నత స్థాయి వరకు చదివించేలా కంకణం కట్టుకోవాలని అన్నారు. అంతేకాకుండా నేటి విద్యార్థులు టీవీలకు సెల్ ఫోన్ లకు బానిస కాకుండా, చదువు అనే వాటికి ప్రాధాన్యత ఇవ్వాలని, చదువును కూడా తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు ప్రోత్సహించినప్పుడే ఆ కుటుంబంలోని పిల్లలు చక్కటి భవిష్యత్తుకు పోయేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. తదుపరి విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున

ఎస్సీ వర్గీకరణ సాధనలో

ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు కీలక పాత్ర

ఎమ్మెల్యే ఎంఎస్.రాజును సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, మార్చి 22 ప్రభాతవార్త

ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీ ఆమోదం పొందడానికి మాల, మాదిగ ఎమ్మెల్యేలను సమన్వయం చేస్తూ, ప్రభుత్వానికి దళితులకు మధ్య సంధానకర్తగా వ్యవహరిస్తూ ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీ ఆమోదం పొందడంలో కీలక పాత్ర పోషించిన మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మెంబర్ ఎమ్మెస్.రాజు అనంతపురంలో కలిసి ఎమ్మార్పిఎస్, ఎంఎస్పి, ఎంఈఎఫ్, ఎంఎస్ఎఫ్ తరపున శాలువా కప్పి, పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఎఫ్ జాతీయ అదనపు ప్రధానకార్యదర్శి బండారుశంకర్‌తోపాటు ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు బండారు కదిరప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షులు యల్లప్పగారి గంగాధర్, జాతీయ కార్యవర్గ సభ్యులు సాకేఅమర్‌నాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ.హనుమంతరావు, జిల్లా అధ్యక్షులు మన్నెపాకుల రమేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బండారు చంద్రశేఖర్ మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగభూషణ మాదిగ, నగర అధ్యక్షులు మీసాల నాగభూషణ, ఉపాధ్యక్షులు బండారు నాగేంద్ర, భైరవ కుమార్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీలు నందిగం వీరయ్య, మల్లికార్జున, తొలితరం నేతలు సాకేసాయిరాం, శిరీగంగరాజు, యువ నాయకులు సోమలదొడ్డి నాగరాజు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పూర్వపు విద్యార్థి పాఠశాలకు ఉపకరణాల వితరణ

ఉపకరణాలను వితరణ చేసిన పూర్వపు విద్యార్థితో పాఠశాల యాజమాన్యం

అనంతపురం న్యూటౌన్, మార్చి 22 ప్రభాతవార్త

రాజేంద్రనగర పాలక ఉన్నత పాఠశాల 1980 సంవత్సరం పూర్వ విద్యార్థి బాలాజీరావు (డివిజనల్ జనరల్ మేనేజర్ త్రివేంద్రం, కేరళ) చొరవతో, కెనరా బ్యాంక్ సాయినగర్ బ్రాంచ్ సౌజన్యంతో రూ.3లక్షల విలువచేసే అవసరమైన కంప్యూటర్లు, సీసీ కెమెరాలు, ప్రింటర్, జిరాక్స్‌మిషన్, కార్యాలయ టేబుల్, కంప్యూటర్ టేబుల్స్, బీరువా, మైక్ సెట్, మీటింగ్ చైర్స్, ఫ్యాన్లు, స్పోర్ట్స్ మెటీరియల్, గేమ్స్ మెటీరియల్ తదితర వస్తువులు శనివారం వితరణ చేశారు. ఈ సందర్భంగా బాలాజీరావు మాట్లాడుతూ.. భవిష్యత్తులో కూడా మా వంతు సహకారం ఈ పాఠశాలకు అందిస్తామని, ఈ ఏడాది 10వ తరగతి పరీక్షల్లో మొదటి, రెండవ, మూడవ స్థానాల విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రేణుకా, బ్యాంక్ రీజినల్‌మేనేజర్ లారెన్స్, మేనేజర్ శ్రీనాథ్‌నాయక్, బ్యాంక్ సిబ్బంది రమేష్‌బాబు, పాఠశాల ఉపాధ్యాయులు రామాంజనేయులు, వి.ఓబులేసు, గాంగేనాయక్, దేవకుమారి, జయరాంనాయుడు, రాజన్న, విరుపాక్షిగౌడు, బి.యుగంధర్, నాగేంద్ర, రామకృష్ణయ్య, రమేష్, కమలమ్మ, రామానుజన్ తదితరులు పాల్గొన్నారు

భూగర్భ జలాలు పెంపొందించటమే లక్ష్యం

- సోరకాయలపేటలో ఫారం ఫాండ్ తవ్వకానికి ఎంపిడిఓ భూమిపూజ

భూమిపూజ చేస్తున్న ఎంపిడిఓ తేజోష్ణ.

పామిడి, మార్చి 22 ప్రభాతవార్త

భూగర్భ జలాలను పెంపొందించటమే లక్ష్యంగా ప్రభుత్వం ఫారం ఫాండ్ తవ్వకాలను చేపడుతోందని ఫలితంగా భవిష్యత్తు తరాలకు నీటి సమస్య ఉత్పన్నం కాకుండా చూడాలన్నదే ముఖ్యఉద్దేశ్యం అని ఎంపిడిఓ తేజోష్ణ పేర్కొన్నారు. ప్రపంచ జల దినోత్సవంలో బాగంగా శనివారం మండల పరదిలోని సోరకాయలపేటలో మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామి పథకం కింద ఫారం ఫాండ్ తవ్వకాలకు ఎంపిడిఓ తేజోష్ణ భూమిపూజ చేశారు. వ్యవసాయ ఫారం పాండ్‌లు స్థిరమైన వ్యవసాయానికి కీలయం అన్నారు. వర్షపు నీరు వృధాగా పోకుండా నీటిని నిలువ చేయటానికి ఫారం ఫాండ్‌లు దోహదపడుతాయని తెలిపారు. ఇదిలావుండగా గ్రామపంచాయతీల పరిదిలో స్థానిక ప్రజాప్రతినిధులు ఫారం ఫాండ్ తవ్వకాలకు భూమిపూజ చేసినట్లు ఎంపిడిఓ తేజోష్ణ వెల్లడించారు. ఈకార్యక్రమంలో ఏపిఓ మల్లేశ్వరి, స్థానిక ప్రజాప్రతినిధులు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో యాంత్రీకరణ యాఫ్

- మండల వ్యవసాయ అధికారిణి లీనా వసుంధర

లీనా వసుంధర

పామిడి, మార్చి 22 ప్రభాతవార్త

యాంత్రీకరణకు సంబందించి యాఫ్ అందుబాటులోకి వచ్చినందున ఆసక్తి అర్హత కలిగిన రైతులందరికీ వివిధ రకాల స్ప్రేయర్లు, ట్రాక్టర్ల పరికరాలను 50 శాతం సబ్సిడీతో అందించనున్న కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని రైతు సేవా కేంద్రాల సిబ్బందిని మండల వ్యవసాయ అధికారిణి లీనా వసుంధర ఆదేశించారు. రైతులకు కేటాయించనున్న విశిష్ట సంఖ్య నమోదు ప్రక్రియపై శనివారం రైతు సేవా కేంద్రాల సిబ్బందితో మండల వ్యవసాయ అధికారిణి లీనా వసుంధర సమీక్ష జరిపారు. సాంకేతిక కారణాలతో ఇప్పటివరకూ రైతు సేవా కేంద్రాల్లో విశిష్ట సంఖ్యను కేటాయిచలేక పోయామని అందువల్ల రాబోవు ఐదు రోజుల్లో రైతు సేవా కేంద్రాల సిబ్బంది రైతులకు విశిష్ట సంఖ్య కేటాయించే ప్రక్రియను పూర్తి చేయాలని తెలియ జేస్తూ రైతులందరూ తమ తమ రైతు సేవా కేంద్రాలో నమోదు చేసు కోవాలని లీనా వసుంధర కోరారు. ఈకార్యక్రమంలో ఏఈఓలు శ్రీనివాసరావు, ఫయాజ్, ఎంపిఈఓలు, విఏఏలు, విహెచ్ఏలు పాల్గొన్నారు.

రికార్డులు సరిగా నిర్వహించండి

- ఎంపిడిఓ భాస్కర్

రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిడిఓ భాస్కర్

శింగనమల, మార్చి 22 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయాన్ని శనివారం ఎంపిడిఓ భాస్కర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యాలయ సిబ్బంది రికార్డులను సరిగా నిర్వహించాలని, ఉద్యోగులు సమయపాలన పాటించి, అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు అన్ని సౌకర్యాలు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా డ్యామ్‌లోకి చేప పిల్లల్ని వదిలే కార్యక్రమం

- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్.

చేపలను వదులుతున్న కలెక్టర్, అధికారులు

కూడేరు, మార్చి 22 ప్రభాతవార్త

ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా 2024-25 సంవత్సరంకుగాను చెరువులలో 40 శాతం సబ్సిడీతో చేప పిల్లలు(80 -100ఎంఎం) వదులు కార్యక్రమంలో భాగంగా కూడేరు మండలం కొర్రకోడు గ్రామంవద్దనున్న పిఏబిఆర్ డ్యాం వద్ద మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పి.ఏ.బి.ఆర్ రిజర్వాయరు 2700.00 హెక్టార్ల విస్తీర్ణం కలిగి వున్నదని, ఈ రిజర్వాయరు నందు 2024-25 సంవత్సరమునకు గాను 5లక్షల చేపపిల్లలు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా సీడ్ స్టాకింగ్ కమిటీ సభ్యులు, ప్రజల సమక్షంలో ఉచితంగా వదిలే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మత్స్యకారులు పీఏబీఆర్ డ్యాంలో నీరు పుష్కలంగా ఉన్నందున వారికి అదనంగా 10లక్షల చేప పిల్లలను సరఫరా చేయవలసిందిగా, కొర్రకోడు గ్రామంలో కమ్యూనిటీ భవనం ఏర్పాటు చేయవలసిందిగా జిల్లా కలెక్టర్‌ని కోరారు. దీనికి సంబంధించి ప్రభుత్వానికి నివేదికలు తయారుచేసి పంపవలసిందిగా అధికారులకు సూచించారు. పి.ఏ.బి.ఆర్ మత్స్య అభివృద్ధి అధికారి పరిధిలో మైనర్‌ఇరిగేషన్ 21 చెరువులకు గాను 2927.4 హెక్టార్ల, 02 రిజర్వాయర్లకు గాను 6403.02 హెక్టార్ల విస్తీర్ణం కలవన్నారు. వీటిలో గల మత్స్య సంపదను ప్రతి ఫసలీ సంవత్సరమునకు లీజు మొత్తం నిర్ణయించి కలెక్టరు ఆమోదంతో లీజుకు ఇవ్వబడునన్నారు. పి.ఏ.బి.ఆర్ మత్స్య అభివృద్ధి అధికారి పరిధిలో 1434 వ ఫసలీనకు 23 చెరువులకు గాను నీరు వచ్చిన 15 చెరువులను మత్స్యసహకార సంఘములకు గుత్తకు ఇవ్వడమైనదన్నారు. తద్వారా రూ.6,69,111 ఆదాయం వచ్చిందన్నారు. వీటి ద్వారా 2884 మెట్రిక్ టన్నుల చేపల ఉత్పత్తి పొందడం జరిగినదని, యంపిఆర్ డ్యాం రిజర్వాయరులో కూడేరు, వజ్రకరూరు మండలం నుండి మత్స్యకారులకు 2024-25 సంవత్సరమునకు 100 లైసెన్సులు లక్ష్యంగాను 85 లైసెన్సులు మంజూరు చేయగా రూ.41,225 ఆదాయం వచ్చినదని తెలిపారు. పి.ఏ.బి.ఆర్ పరిధిలో 11 మత్స్య సహకార సంఘములు, 03 మహిళా మత్స్య సహకార సంఘం కలవని, మొత్తం 1134 మత్స్యకారులు కలరని, ఇందులో 50 సంవత్సరములు పైబడిన మత్స్యకారులకు 144 మందికి మత్స్యకార యన్.టి.ఆర్. పింఛను కానుక ద్వారా రూ.4,000 ప్రతి నెల లబ్ధి పొందుతున్నారని, పి.ఏ.బి.ఆర్ పరిధి నందు ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకము ద్వారా జనరల్‌కు 40, మహిళ, యస్.సి వారికి 60సబ్సిడీ ద్వారా 13 చిన్న తరహా చేపల కొట్టులు ఏర్పాటు చేయడం జరిగినదని, అలాగే ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారులకు ప్రభుత్వ ప్రమాద భీమా ద్వారా రూ.5లక్షల నుండి 10 లక్షలకు పెంచడం జరిగినదని ప్రభుత్వం మత్సకారులకు అనేక విధాలుగా సహాయ సహకారాల అందిస్తున్నదిని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, డ్వామా పీడీ సలీమ్ బాషా, తహశీల్దార్ మహబూబ్ బాషా, ఫిషరీస్ డిడి శ్రీనివాస నాయక్, ఎఫ్టిఎఫ్ ఆసిఫ్, పెద్ద బాబునాయక్, అధికారులు, ప్రజా ప్రతినిధులు మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.

పేదరికం నిర్మూలన ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కార్యక్రమాలు

- అనంతపురం జిల్లా టిడిపి అధికార ప్రతినిధి సరిపూటి రమణ

మాట్లాడుతున్న సరిపూటి రమణ

అనంతపురం అర్బన్, మార్చి 22 ప్రభాతవార్త

రాష్ట్రంలో పేదరికం నిర్మూలనే ధ్యేయంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పి4 సర్వే కార్యక్రమాలు చేపట్టడం ద్వారా పేదరికం నిర్మూలించవచ్చని అనంతపురం జిల్లా టిడిపి అధికార ప్రతినిధి మాజీ కార్పొరేటర్ సరిపూటి రమణ పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ సూచన మేరకు నగరంలోని 38, 39 సచివాలయం లో పి4 సర్వే కార్యక్రమం సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అనంతపురం జిల్లా టిడిపి అధికారప్రతినిధి మాజీ కార్పొరేటర్ సరిపూటి రమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదరిక నిర్మూలన ధ్యేయంగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. పి4 సర్వే ద్వారా పేదరిక నిర్మూలనలో భాగంగా దాదాపు 20 శాతం మంది పేదలను గుర్తించి ఎన్నారై, ధనవంతుల భాగస్వామ్యంలో ఉపాధి అవకాశాలను కల్పించి పేదికరం లేని రాష్ట్రంగా మొదటి స్థానంలో నిలపాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యం అన్నారు. దీని కోసం త్వరలో విధివిధానాలను రూపొందించి ప్రజలను భాగస్వామ్యం చేసామన్నారు. కేంద్రం సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆలోచనలకు అనుగుణంగా నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధికారప్రతినిధి రజాక్, డివిజన్ అధ్యక్షులు సరిపూటి శ్రీకాంత్, గోవిందు, సచివాలయం ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ

నారసత్య

గార్లదిన్నె మార్చి 22, ప్రభాతవార్త

గార్లదిన్నె మండలంలోని స్థానిక కస్తూరిబా పాఠశాల ఆరవ తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాల కోసం, 7 8 9 తరగతిలో మిగిలిన సీట్లు భర్తీ కోసం 2025-26 విద్యా సంవత్సరం గాను సీట్లకు పిఆర్సి టీచర్ స్కూల్ ట్రైనింగ్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ ప్రిన్సిపల్ నాగసత్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 7,8,9వ తరగతిలో కేవలం మిగిలిన సీట్లుకు మాత్రమే ప్రక్రియ ఉంటుందని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ పి ఎస్ టి టి, పి ఆర్ సి స్కూల్ టీచర్ ట్రైనింగ్ ఒకేషనల్ గ్రూప్ కు 40 సీట్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఈనెల 22 నుండి ఏప్రిల్ 11వ తేదీ వరకు మాత్రమే ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవడానికి అందుబాటులో ఉంటుందని అన్నారు. ఇతర వివరాలకు గార్లదిన్నె కస్తూరిబా పాఠశాల ప్రిన్సిపాల్ నాగసత్యను సంప్రదించాలని తెలిపారు.

రైతులందరూ రిజిస్ట్రేషన్ చేయించుకోండి

- ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, మార్చి 22 ప్రభాతవార్త

నియోజకవర్గ వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ రైతు రిజిస్ట్రేషన్ కింద ప్రతి ఒక్క రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. శనివారం ఆమె పత్రికా ప్రకటన విడుదల చేస్తూ.. రైతులందరూ వారివారి సమీప రైతు సేవా కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, వారి వెంట పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, ఆధార్‌కార్డుకు లింకైన మొబైల్ తీసుకెళ్లి ఓటిపి ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందుతాయని ఆమె పేర్కొన్నారు.

గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించండి

- మండల సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీసిన సర్పంచులు
- కేవలం రెండు గంటలలోనే ముగించిన సర్వసభ్య సమావేశం.

అనంతపురం రూరల్,మార్చి22ప్రభాతవార్త:

సమస్యలను పరిష్కరించాలని అధికారులను నిలదీస్తున్న సర్పంచులు

అనంత రూరల్ మండలం వివిధ గ్రామ పంచాయితీలోని సమస్యలను పరిష్కరించాలని సర్పంచులు అధికారులను నిలదీశారు. శనివారం ఎంపిపి వరలక్ష్మి అధ్యక్షతన ఎంపిడిఓ దివాకర్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వైఎస్ ఎంపిపి బాలాజీ, జెడ్పిటిసి చంద్రకుమార్, ఎంపిటిసిలు, సర్పంచులు, మండల అధికారులు హాజరైయ్యారు. ఈ సమావేశంలో అజెండాలోని వివిధ

హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

అంశాలపై వివిధశాఖ అధి కారులు ఆ శాఖలలో జరిగిన పనుల వివరాలను సభ్యులకు తెలియజేశారు. అజెండాలో 15 అంశాలు ఉండగా ఈ సమావేశం మాత్రం కేవలం రెండు గంటలలోనే ముగించారు.

పూలకుంటలో విద్యుత్ సమస్యను పరిష్కరించండి: సర్పంచ్ కాటప్పగారి కృష్ణారెడ్డి:

అనంత రూరల్ మండలం పూలకుంట గ్రామ పంచాయితీలో గత నాలుగు నెలలుగా విద్యుత్ పోల్స్,విద్యుత్ సౌకర్యం లేక గ్రామంలోని కొన్ని కాలనీ ప్రజలు అదే విధంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడడం జరుగుతుందని కావున ఇప్పటికైన గ్రామంలోని విద్యుత్ సమస్యను పరిష్కరించాలని ఆయన అధికారులను కోరారు.

తొలగించిన వాటర్ మ్యాన్‌ను విధులలోకి తీసుకోవాలి కక్కలపల్లి సర్పంచ్ గార్లదిన్నె కృష్ణయ్య:

అనంత రూరల్ మండలం కక్కలపల్లి రూరల్ గ్రామ పంచాయితీలో గత 25 సంవత్సరాలుగా వాటర్ మ్యాన్‌గా విధులు నిర్వహిస్తున్న నాగరాజును తొలగించి ప్రజలకు నీరు ఏవిధంగా విడుదల చేయాలనే అవగాహన లేని వ్యక్తిని వాటర్ మ్యాన్‌గా నియమించడంతో గ్రామంలోని ప్రజలకు సక్రమంగా నీరు విడుదల చేయడం లేదని కావున అధికారులు తొలగించిన వాటర్ మ్యాన్ నాగరాజును తిరిగి విధులలోకి తీసుకుని ప్రజలకు సక్రమంగా నీరు విడుదల అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు.

చియ్యేడు గ్రామంలోని తాగునీటీ సమస్యను పరిష్కరించండి: సర్పంచ్ గంగాధర్‌రెడ్డి

అనంత రూరల్ మండలం చియ్యేడు గ్రామ పంచాయితీలో తాగునీటీ సమస్య ఏర్పాడంతో గ్రామంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడడం జరుగుతుందని అసలే ఎండలు అధికం కావడం జరిగాయని ఈ ఎండలకు నీటీ సమస్య అధికం కావడం జరుగుతుందని నీటీ సమస్య అధికమైతే ప్రజలు తీవ్ర కష్టలు ఎదుర్కోనడం జరుగుతుందని కావున గ్రామంలో ఏర్పాడిన తాగునీటీ సమస్యను పరిష్కరించాలని ఆయన అధికారులను కోరారు.

శిలాఫలంపై నా పేరు ఎందుకు వేయాలేదు: రాజీవ్ కాలనీ ఎంపిటిసి 1 సంధ్య:

రాజీవ్ కాలనీ పంచాయితీ పరిధీలో ఇటీవల అధికారులు సిసి రోడ్డు నిర్మాణానికి అధికారులు భూమి పూజ చేసి అక్కడ శిలాఫలం ఏర్పాటు చేయడం జరిగిందని కాని ఆ శిలాఫలంలో ఎంపిటిసి1 గా ఉన్న నా పేరు ఎందుకు వేయకుండా నిర్లక్యంగా వ్యవహరించారని ఆమె అధికారులను నీలదీయడంతో మరోసారి ఇలాంటీ పోరపాటు జరగకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్‌డీ వెంకటనాయుడు, ఎంపిటిసిలు, సర్పంచులు, మండల అధికారులు, గ్రేడ్ 1 పంచాయితీ కార్యదర్శులు హిదయతుల్లా, అశోక్‌బాబు, ప్రవీణ్‌బాబు, రవి చంద్ర, మమమ్మద్ రఫి, బాబాఫకృద్దీన్,శ్రీధర్‌రావు,మల్లికార్జున పాల్గొన్నారు.

ఫారం పాండ్ నిర్మాణానికి భూమి పూజ

ఆకుతోటపల్లిలో ఫారం పాండ్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న అధికారులు

అనంతపురం రూరల్,మార్చి 22,ప్రభాతవార్త

అనంత రూరల్ మండలం ఆకుతోటపల్లి గ్రామ పంచాయితీలో ఫారం పాండ్ నిర్మాణానికి డియల్ డిఓ లలితాబాయి,ఎంపిపి వరలక్ష్మి ఈశ్వరయ్య, ఎంపిడిఓ దివాకర్,గ్రామ సర్పంచ్ గురుప్రసాద్,టిడిపి క్లస్టర్ ఇన్‌చార్జ్ రాగే మురళి,ఏపిఓ చంద్రకళ, గ్రేడ్ 1 పంచాయితీ కార్యదర్శి అశోక్‌బాబు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం,జిల్లా కలెక్టర్, డిపిఓల ఆదేశాల మేరకు ప్రపంచ జల దినోత్సవంలో భాగంగా ఆకుతోటపల్లి గ్రామంలో మహాత్మా గాంధీ జీతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఫారం పాండ్ నిర్మాణానికి భూమి చేసి పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. అనంతరం వారు గ్రామంలోని ఇంటీ ఇంటీకి వెళ్లి తడి పోడి చెత్తను ప్రజల నుంచి సేకరించారు. అదే విధంగా గ్రామంలోని చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రానికి వెళ్లి అక్కడ ఏవిధంగా తడి పోడి చెత్తను నిలువ చేస్తున్నారో పరిశీలించారు.

ఎస్సీ వర్గీకరణ సాధనపై మాదిగల హర్షధ్వానాలు

మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

రాప్తాడు రూరల్ మార్చి 22,ప్రభాతవార్త

మూడు దశాబ్దాల నిరంతర పోరాటానికి నేటి రోజు న్యాయం లభించిందని మాదిగలు హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ సాధన సందర్భంగా రాప్తాడు నియోజకవర్గంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మరియు మాదిగ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పలు వేడుకలు జరిగాయి. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తూ, అనేక మంది నేతలు ఆయన నడిపిన పోరాటాన్ని స్మరించుకున్నారు. ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి కుంచెం నాగభూషణ మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా జరిగిన ఉద్యమాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని తీసుకున్నందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాప్తాడు నియోజకవర్గ ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు పాల్గొన్నారు. రాప్తాడు ఎంఆర్‌పీఎస్ సీనియర్ సలహాదారుడు జూటూరు లక్మన్న, రూరల్ మండలం ఎంఆర్‌పీఎస్ నాయకులు సోములదొడ్డి నాగరాజు, రాప్తాడు చర్మల రాము, రామనేపల్లి పోతులయ్య, ముత్యాలు, పసులు మరెప్ప, నారాయణ, జూటూరు నారాయణ, మారుతి, శ్రీరాములు తదితరులు హాజరయ్యారు. ఎస్సీ వర్గీకరణ సాధన మాదిగల న్యాయమైన హక్కుగా మారిందని, ఈ అవకాశాన్ని భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా అందరూ కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

అనధికార లేఔట్ ల పై అహుడా కోరడా

అనధికారలే అవుట్లలో సర్వే రాళ్లను తొలగిస్తున్న అహుడ సిబ్బంది

అనంతపురం వైద్యం మార్చి 22 ప్రభాతవార్త

నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు తీసుకోకుండా అనధికారికంగా లేఅవుట్లు వేసిన 6 అనధికారులు అవుట్లపై అహుడ కొరడా ఝుళిలిపించింది. అహుడా చైర్మన్, వైస్ చైర్మన్ టి సి వరుణ్ జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ ఆదేశానుసారం శనివారం కమ్మూరు గ్రామంలోని హిబా టౌన్షిప్ లేఅవుట్ , బ్రాహ్మణపల్లి సంసిద్ధి లేఅవుట్ , అదేవిధంగా కమ్మూరు గ్రామంలోని సర్వేనెంబర్ 561, సర్వేనెంబర్ 555, సర్వేనెంబర్ 504, సర్వే నంబర్ 498లో వేసిన అనధికార లేఔట్లలో ప్లానింగ్ ఆఫీసర్ ఇషాక్, జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్ హరీష్ చౌదరి, స్థానిక సిబ్బంది, బ్రాహ్మణపల్లి పంచాయతీ కార్యదర్శి హరినాథ్ లు రాళ్లను తొలగించి వాటి యజమానులకు నోటీసులు జారీచేశారు. అహుడ పరిధిలో అనధికార లేఔట్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలకు సకల వసతులు కల్పించి అన్ని అనుమతులు తీసుకోవాలని, నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని చైర్మన్, వైస్ చైర్‌పర్సన్‌లు హెచ్చరించారు.

ఫైలేరియా మేనేజ్మెంట్ కిట్ పంపిణీ

అనంతపురం వైద్యం మర్చి 22 ప్రభాతవార్త

కిట్లను పంపిణీ చేస్తున్న మలేరియా అధికారులు

అనంతపురం జిల్లాలో గతంలో నమోదు అయిన 52 ఫైలేరియా కేసుల మార్పిడి కోసం ఫైలేరియా మేనేజ్మెంట్ కిట్లను అనంతపురం జిల్లా జిల్లా మలేరియా అధికారి డి ఓబులు మలేరియా సబ్ యూనిట్ అధికారులకు అందజేశారు. శనివారం అనంతపురం జిల్లా మలేరియా కార్యాలయంలో సబ్ యూనిట్ మలేరియా అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఫైలేరియా కిట్లను పంపిణీ చేసిన అనంతరం అధికారులు మాట్లాడుతూ జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఇంటింటికి వైద్య ఆరోగ్య సిబ్బంది క్రమం తప్పకుండా క్షేత్ర స్థాయిలో ఫీవర్ సర్వే నిర్వహించి ప్రజలకు కాలానుగుణ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలన్నారు ఈ సమావేశంలో ఎంపీ హెచ్ ఈ ఓ లు కె గిరిధర్ రెడ్డి ,బత్తుల కోదండరాంరెడ్డి , మద్దయ్య,మునాఫ్,రామకృష్ణ,నాగేంద్రప్రసాద్,రమేష్ ,హెల్త్ సూపర్వైజర్లు శ్రీధర్ ,ఈ రమేష్ బాబు .తదితరులు సమావేశంలో పాల్గొన్నారు .

కృష్ణాంరెడ్డిపల్లిలో చలివేంద్రం ఏర్పాటు

కృష్ణాంరెడ్డిపల్లిలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్,మార్చి22ప్రభాతవార్త:

అనంత రూరల్ మండలం కందుకూరు గ్రామ పంచాయితీ కృష్ణాంరెడ్డిపల్లి క్రాస్ వద్ద గ్రామ పంచాయితీ కార్యదర్శి మల్లికార్జున వివిధ పార్టీ నాయకులతో కలసి చలివేంద్రంను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండలు తీవ్రత ఎక్కువ అయిందని వీటీ వలన అనంత నగరం నుంచి బత్తలపల్లి, అదే విధంగా వివిధ గ్రామాలకు పోయే ప్రజల దాహంతో ఇబ్బంది పడకుండా మెయిన్ రోడ్డులోని కృష్ణాంరెడ్డిప

04ATP13_04ATP13.qxd 22-03-2025 PM 10:40 Page 1

ప్రసంగంలో మామకు తగ్గ కోడలు ఈ యువ ఎమ్మెల్యే

ప్రజల సమస్యలను నిత్యం అసెంబ్లీ లో వినిపించడంలో దిట్ట

పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డిని ప్రశంసించిన రాజకీయ ప్రముఖులు

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి , ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి నుండి మెమెంటో తీసుకుంటున్న ఎమ్మెల్యే

పుట్టపర్తి టౌన్, మార్చ్ 22, ప్రభాతవార్త

మామకు తగ్గ కోడలు అనిపించుకున్నారు ఈ యువ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి. సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గ ప్రజల సమస్యలపై అను నిత్యం అసెంబ్లీలో తన ప్రశంసలు వినిపిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ఎమ్మెల్యే పల్లె సింధూర అత్యంత సక్సెస్ అయ్యారు. ఫిబ్రవరి 24న ప్రారంభమైన శాసనసభ సమావేశాలు మార్చి 20 వరకు కొనసాగాయి. సుమారు 15 రోజులపాటు కొనసాగిన ఈ శాసనసభ సమావేశాల్లో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సుమారు15 ప్రశ్నలను నియోజవర్గ సమస్యలపైనే కాకుండా ఎంతో ముఖ్యమైన విషయాలను కూడా అసెంబ్లీలో ప్రస్తావించారు. తన వాక్చాతుర్యంతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అసెంబ్లీలో అందరినీ అబ్బురు పరిచారు. అసెంబ్లీలోనే కాకుండా శాసనసభ్యులకు మూడు రోజులుగా నిర్వహించిన క్రీడల్లో కూడా అద్భుతంగా రాణించి ప్రముఖుల ప్రశంస లందుకున్నారు. గతంలో నల్లమాడ, ఆతర్వాత ఏర్పాటు అయిన పుట్టపర్తి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల్లో ఎవరు కూడా ఈ విధంగా అసెంబ్లీలో మాట్లాడిన దాఖలాలు లేవు. అయితే ఈ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి దీటుగా కొంత వరకు ఆమె మామ మాజీమంత్రి పల్లెరఘునాథ్ రెడ్డి గారు ప్రభుత్వ విప్‌గా,ఎమ్మెల్సీగా, మంత్రిగా,ప్రభుత్వ చీఫ్‌విప్‌గా పనిచేసిన కాలంలో నియోజకవర్గ సమస్యలపైన ,ఇతర సమస్యలపై అసెంబ్లీలో పెద్ద గళం వినిపించేవారు. ఆ తర్వాత ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఎవరు ఈ స్థాయిలో ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో కొంత వెనుకబడి ఉన్నారని కూడా చెప్పవచ్చు. ప్రస్తుతం అసెంబ్లీలో నిత్యం ప్రజల సమస్యలపై గళం విప్పుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తన మామకు తగ్గ కోడలు దొరికిందని పుట్టపర్తి నియోజకవర్గం ప్రజలు చర్చించు కుంటున్నారు.మామ పల్లె రఘునాథ్‌రెడ్డికి తగ్గకోడలుఅని నిరూపించుకున్నావ్ అని స్వయంగా ముఖ్యమంత్రితో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు సింధూర రెడ్డి ప్రశంసించారు. 5న పుట్టపర్తి నియోజకవర్గం లోని 193 చెరువులు రెండు రిజర్వాయర్లు నీళ్లు ఎప్పుడు ఇస్తారు, ఆ పనులు ఎప్పుటీ నుంచి ప్రారంభిస్తారో అసెంబ్లీలో ప్రస్తావించారు. మార్చ్ 12 ఉమ్మడి అనంతపురం జిల్లా ఉద్యాన రైతులకు 10ఎకరాల వరకు సబ్సిడీ వర్తించేలా ప్రత్యేక జీవో ఇవ్వాలని, అలాగే ఎస్సీ ఎస్టీ రైతులకు 100 రాయితీతో డ్రిప్పు స్ప్రింకర్లు మిగతా రైతులకు 90 శాతం రాయితీతో అందించాలని అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రస్తావించారు. మార్చ్ 13 పుట్టపర్తి మున్సిపాలిటీలో అర్ధాంతరంగా ఆగిపోయిన టిడ్కో ఇండ్లను త్వరగా పూర్తి చేయాలని అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే. వైసీపీ ప్రభుత్వ హయాంలో రద్దు చేసిన 8 64 గృహాలను తిరిగి నిర్మించేలా ప్రభుత్వం రీటెండర్లు పిలవాలని గట్టిగా ప్రస్తావించారు. అనంతరం నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన ప్రజా ప్రతినిధులకు విజయవాడ ఏ వన్ కన్వర్షన్ హాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,డిప్యూటీ సీఎంపవన్‌కళ్యాణ్,స్పీకర్ అయ్యన్న పాత్రుడు,డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు ,రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చేతులమీదుగా కప్పులను, మెమెంటో లను అందజేసి అభినందించారు.

పట్టాల పంపిణీలో చేతివటం ప్రదర్శిస్తే చర్యలు తప్పవు..!

ఎమ్మెల్యే రాజు , మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

మండల అభివృద్ధి శాఖ, అధికారులతో సమీక్షించిన ఎమ్మెల్యే రాజు ,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

మడకశిర టౌన్ మార్చి 22 ప్రభాతవార్త

నిరుపేదల ఇంటి స్థలాల అవసరమయ్యే అనుమతి పత్రాలను ప్రజలకు అందించే విషయంలో రెవిన్యూ అధికారులు చేతివాటం ప్రదర్శించక పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని లేనిపక్షంలో ఆదేశాలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే రాజు మాజీ ఎమ్మెల్సీ గుండముల తిప్పేస్వామిలు తీవ్రంగా హెచ్చరించారు, శనివారం పట్టణంలోని ఆర్ అండ్ బి విశ్రాంతి భవనంలో రెవెన్యూ, మండల అభివృద్ధి అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు ,తోలుత నేతలు మాట్లాడుతూ: నిలువ నీడలేని నిరుపేదలకు కుల మతాలకు, పార్టీలకు అతీతంగా పరిశీలన అనంతరం నియోజకవర్గ వ్యాప్తంగా ఉంటున్న 20వేల మంది లబ్ధిదారులకు నీడ కల్పించాలని కూటమి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంటుందన్నారు, ఇందులో భాగం గానే ఇంటి స్థలాల సంబంధించి రెవిన్యూ కార్యాలయం లో పలువురు వీఆర్వోలు ,వీఆర్ఏలు, ఒక్కొక్క అనుమతి పత్రం అందించేందుకు తమ జానతనంతో పేదల అవసరాన్ని ఆసరాగా చేసుకొని అందిన కాటికి వసుళ్ళ పర్వానికి తెరలేపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు, అంతేకాకుండా వసూళ్లకు పాల్పడుతున్న కొందరి పేర్ల జాబితా కూడా తన వద్ద ఉందని గుర్తుచేస్తూ ఇప్పటికైనా పద్ధతులు మార్చుకోవాలని లేనిపక్షంలో చర్యలు తీసుకోవడం ఖాయం అంటూ సుత్తి మెత్తంగా ఎమ్మెల్యే రాజు హెచ్చరించారు,ఈ జాడ్యం ఒక మడకశిర మండలమే కాకుండా నియోజకవర్గ పరిధిలోని ఉంటున్న రెవెన్యూ కార్యాలయంలోనూ ఈ ఘటన చోటు చేసుకోవడం. దారుణం అన్నారు . పేదల అవసరాన్ని గుర్తెరిగి ప్రభుత్వం వారిని ఆదుకోవాలని ఏకైక సంకల్పంతో కూటమి సర్కారు అడుగులు వేస్తుంటే కొంతమంది క్రింది స్థాయి ఉద్యోగులు సహకరించకుండా చేతివాటం ప్రదర్శించడం ఎంతవరకు సమంజసమని మండిపడ్డారు. ఇప్పటికైనా ఈ పద్ధతిని విడనాడి ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించి ప్రజలకు మెరుగైన ఫలితాలు అందేలా పనిచేయాలని వారు సూచించారు. ముఖ్యంగా దళితులు స్మశాన వాటికలు లేక దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిందని ఆ విషయాన్ని మీరు గుర్తురిగి దళిత వాడలకు సమీపంలో స్మశాన వాటిక లకు స్థలాన్వేషణ పై దృష్టి సంబంధించలన్నారు. వీటితోపాటు వెనుకబడిన, కులాలకు బిసిలకు ఆర్థికంగా. సామాజికంగా సంక్షేమ పథకాలు దూరంగా ఉంటున్న వెనుకబడిన బిసిల కులాలను గుర్తించి సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు వారు పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో రెవిన్యూ శాఖ అధికారులు, తాసిల్దార్లు.కర్ణాకర్ గౌడ్, లక్ష్మీనారాయణ.మండల అభివృద్ధి శాఖ అధికారులు. ఎంపీడీవో సోనీ బాయ్. టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, ఐదు మండలాల కన్వీనర్లు. నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఏ గ్రామంలోనూ తాగునీటి సమస్య రానివ్వద్దు

- జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ, మార్చి 22 ప్రభాతవార్త

జిల్లాలో వేసవిలో ఏ గ్రామంలోనూ తాగునీటి సమస్య రానివ్వద్దని అధికారులకు జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జడ్పి స్థాయి సంఘం సమావేశాలను జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తాగునీటి సమస్యపై ప్రధానంగా చర్చించారు. జిల్లాలో ఎన్ని మండలాల్లో తాగునీటి ఇబ్బంది అధికంగా ఉందని జడ్పి చైర్మన్ ఆరాతీయగా ఏడు మండలాల్లో సమస్య ఉందని అధికారులు పేర్కొన్నారు. తాగునీటి సమస్యపై ప్రధానంగా దృష్టి సారించాలని ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించి ఎక్కడే కానీ తాగునీటికి రోడ్లపైకి ప్రజలు వచ్చే పరిస్థితి రానివ్వద్దని సూచించారు. జిల్లా పరిషత్ నుంచి నిధులను తాగునీటి అవసరాలకు కేటాయిస్తున్న కొన్నిచోట్ల సమస్యలు వస్తున్నాయని, లోపం ఎక్కడ ఉందో గుర్తించాలని సూచించారు. బికెఎస్ మండలంలో తాగునీరు రంగు మారి వస్తోందని జడ్పిటిసి భాస్కర్ సభ దృష్టికి తీసుకురాగా వెంటనే ఫిల్టర్లను మార్పించి శుద్ధ జలాలను అందించాలని జడ్పి చైర్మన్ అధికారులను ఆదేశించారు. అదే విధంగా కణేకల్లు, గోరంట్ల మండలాల్లో తాగునీటి సమస్యలపై ఆ ప్రాంత జడ్పిటిసిలు సభ దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అదే విధంగా జిల్లా పరిషత్ నుంచి తాగునీటి అవసరాలకు నిధులను కేటాయిస్తున్నా తిరిగి యూజర్ చార్జీలు మున్సిపాలిటీల నుంచి రూ.96 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయని, వాటిని వసూలు చేసి జిల్లా పరిషత్ ఖాతాలో జమా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను జడ్పి చైర్మన్ ఆదేశించారు. అదే విధంగా కంబదూరు మండలంలో రోడ్లను ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నా అధికారులు పట్టించు కోలేదని, గత సమావేశంలోనూ ఇదే సమస్యను ప్రస్తావించానని జడ్పిటిసి సూచించగా, సంబంధిత అధికారులు జడ్పిటిసితో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించాలని జడ్పి చైర్మన్ సూచించారు. అదే విధంగా నార్పల మండలంలో రోడ్లు దెబ్బతిన్నాయని, జడ్పి చైర్మన్ నాగరత్నమ్మ అధికారుల దృష్టికి తీసుకురాగా

త్వరలోనే టెండర్లు పిలిచి పనులను ప్రారంభిస్తామని అధికారులు పేర్కొన్నారు. 10వ తరగతి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలను కల్పించాలని సభ్యులతోపాటు జడ్పి చైర్మన్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో పలు అంశాలపై సభ్యులు లేవనెత్తిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని జడ్పి చైర్మన్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పి వైస్ చైర్మన్ నాగరత్నమ్మ, జడ్పి సిఇఓ రామచంద్రరెడ్డి, డిప్యూటీ సీఈఓ వెంకట సుబ్బయ్యతోపాటు పలువురు ప్రజా ప్రతినిధులు పలు శాఖల ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు.

మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్‌ను పరామర్శించిన పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

- అనారోగ్యంతో మృతి చెందిన మంత్రి సతీమణి షెహనాజ్ - హైదరాబాదులో మంత్రికి పరామర్శ.. షెహనాజ్ మృతి పై సంతాపం



మంత్రిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీత, పరిటాల సునీత

అనంతపురం, మార్చి 22 ప్రభాతవార్త బ్యూరో

ఆంధ్రప్రదేశ్ మైనారిటీ సంక్షేమ శాఖమంత్రి ఎన్.ఎం.డి ఫరూక్‌ను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ పరామర్శించారు. మంత్రి ఫరూక్ సతీమణి షహనాజ్ కొంతకాలంగాఅనారోగ్యంతో బాధపడుతూ..హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రి లో చికిత్స పొందుతూ కన్నుమూశారు. విషయం తెలుసుకున్న సునీత, శ్రీరామ్ హైదరాబాద్‌లోని మంత్రి ఇంటికి వెళ్లారు. షహనాజ్ మృతికి సంతాపం తెలిపారు. ఆమె ఆరోగ్య పరిస్థితి మొదటి నుంచి ఎలా ఉందన్నది అడిగి తెలుసుకున్నారు. అలాగే తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంత్రి ఈవిషాదంనుంచి త్వరగా కోలుకునేలా అల్లా చూడాలని వారు కోరుకున్నారు.

ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా అనంతపురంలో చలివేంద్రం ప్రారంభం

మజ్జిగను పంపిణీ చేస్తున్న ఎంపి అంబికా లక్ష్మినారాయణ

అనంతపురం, మార్చి 22 ప్రభాతవార్త బ్యూరో

అనంతపురం అర్బన్ మునిసిపల్ ఆఫీస్ ప్రాంగణంలో శ్రీరామ వాటర్ ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మినారాయణ ప్రారంభించారు. నీటి దినోత్సవం సందర్భంగా, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు శ్రమిస్తున్న శ్రీరామ వాటర్ ప్యూరిఫైడ్ సంస్థకు, ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేశారు. నీటి సంరక్షణపై అవగాహన పెంచుకోవాలి, ప్రతి నీటిబొట్టును విలువైనదిగా భావించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, వాటర్ ప్లాంట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం కలిసిన ఆహుడా చైర్మన్ టిసి వరుణ్

అనంతపురం వైద్యం మార్చి 22 ప్రభాతవార్త

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో ఆహుడా చైర్మన్ టి సి వరుణ్

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శనివారం కర్నూలు జిల్లా పూడి చెర్ల ఫారం పాండ్స్ శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన సంధర్భంగా కర్నూలు జిల్లా ఒర్వకల్లు విమానాశ్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు అనంతపురం జిల్లా అధ్యక్షులు, అహుడా చైర్మన్ టిసి వరుణ్, పలు నియోజకవర్గాల ఇన్చార్జిలు జనసేన పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. హాయ్ వరుణ్‌అంటూ పవన్ కళ్యాణ్ ఎంతో ఆప్యాయంగా పలకరిస్తూ కరచాలనం చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బోయి భీమన్న జాతీయసదస్సుకు సాహితీ అతిథిగా డాక్టర్ బత్తలఅశోక్‌కుమార్ ఎంపిక

అనంతపురం, మార్చి 22 ప్రభాతవార్తబ్యూరో

డాక్టర్ బత్తల అశోక్ కుమార్

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తెలుగు మరియు తులనాత్మక సాహిత్య శాఖ ఐసిఎస్ ఎస్ఆర్ (ఐసిఎస్ఎస్ఆర్) పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ పరిశోధకులు డాక్టర్ బత్తలఅశోక్ కుమార్ డాక్టర్ బోయి భీమన్న జీవితం సాహిత్యం జాతీయ సదస్సుకు సాహితీ అతిథిగా హాజరు కానున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, శ్రీశ్రీ కళావేదిక, బోయి భీమన్న సాహితీ నిధి ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో రాజమండ్రిలోని ఆనం రోటరీ హాలు నిర్వహించనున్న డాక్టర్ బోయి భీమన్న జీవితం సాహిత్యం అనే జాతీయ సదస్సుకు సాహితీ అతిథిగా డాక్టర్ బత్తల అశోక్‌కుమార్ ఆహ్వానం అందుకున్నారు. ఈ జాతీయ సదస్సులో భీమన్న రచనల్లోని పునర్ మూల్యాంకన దృక్పథం పైన ప్రసంగం చేయనున్నారు. ఈ మేరకు శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సీఈవో కత్తిమండ ప్రతాప్, బోయి భీమన్న సాహితీ నిధి ట్రస్ట్ చైర్ పర్సన్ బోయి హైమావతి, సదస్సు కన్వీనర్, శ్రీశ్రీ కళావేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ టీ.పార్థసారథి ఈ మేరకు ఆహ్వానం పంపారు. జాతీయ సదస్సుకు డాక్టర్ బత్తలఅశోక్‌కుమార్ ఎంపికవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా శ్రీవారి తీర్థవాది.. చక్రస్నానం

- ఆనందోత్సవాలతో వసంతాలు చల్లు కొన్న భక్తులు

శోభాయ మానంగా అలంకరించిన స్వామివారి మూలవిరాట్ , స్వామివారికి చక్రస్నానం చేయిస్తున్న దృశ్యం

కదిరి, మార్చి 22 ప్రభాతవార్త

ప్రముఖ ప్రసిద్ధిగాంచిన శ్రీమద్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు 15 రోజులపాటు అత్యంత వైభవంగా జరిగాయి. అందులోభాగంగా చివరి రోజైన శనివారం శ్రీవారి తీర్థవాది కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీవారి భృగుతీర్థంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారి ఉత్సవ మూర్తులకు చక్రస్నానం, స్తపన, తిరుమంజనం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని తిరువీధులలో ఊరేగింపుగా ఆలయానికి చేర్చారు. ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ వేద పండితులు శ్రీవారి కంకణాలు తొలగింప చేశారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా పట్టణానికి చెందిన తాయి అశ్వర్థ నారాయణ శెట్టి, తాయి ప్రభాకర్‌గుప్తా కుటుంబ సభ్యులు వ్యవహరించారు. శ్రీవారి పునఃదర్శనం ఆదివారం ఉదయం 6:30గంటలకు ఉంటుందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున వసంతాలు తెల్లకొంటూ బృగుతీర్థం వద్ద శ్రీవారి ఉత్సవాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప కమిషనర్ వెండిదండి శ్రీనివాసరెడ్డి, ఆర్డీవో వివిఎస్ శర్మ, ఆలయ ప్రధాన అర్చకులు ఏవి నరసింహాచార్యులు, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పుర ప్రముఖులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడినా, ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తప్పవు

- జిల్లాలో క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకులు, పందెంరాయుళ్లపై ప్రత్యేక నిఘా- జిల్లా ఎస్‌పి పి.జగదీష్

అనంతపురం కలెక్టరేట్, మార్చి 22 ప్రభాతవార్త

జిల్లా ఎస్‌పి జగదీష్

క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడినా, ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఎస్‌పి పి.జగదీష్ పేర్కొన్నారు. ఐపిఎల్ సీజన్ శనివారం నుండి ప్రారంభమవుతున్న నేపథ్యంలో జిల్లాలో ఎక్కడా క్రికెట్ బెట్టింగ్‌లకు తావు లేకుండా ప్రజలు సహకరించాలన్నారు. అమాయక ప్రజలు, యువతను లక్ష్యంగా చేసుకొ .అధికంగా డబ్బు సంపాదించవచ్చని అత్యాశ రేకెత్తించేలా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తూ మోసం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్‌ల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి నిఘా పెట్టామన్నారు. క్రికెట్ బెట్టింగులతో సంబంధాలు వున్న పాత నేరస్తులపై కూడా బైండోవర్ కేసులు నమోదు చేయటం జరిగిందన్నారు. తల్లిదండ్రులు బాధ్యత తీసుకుని యువత, విద్యార్థులు బెట్టింగ్ జోలికి వెళ్లకుండా చూడాలన్నారు. ఒకసారి కేసుల్లో ఇరుక్కుపోతే జీవితం నాశనమవుతుందని మున్ముందు ప్రభుత్వ ఉద్యోగాలు కూడా రావనే విషయాలను తెలియచేయాలన్నారు. క్రికెట్ బెట్టింగ్ వల్ల కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయన్నారు. వినోదం కోసం మాత్రమే క్రికెట్ మ్యాచ్‌లు చూడాలని, బెట్టింగులు వైపు మొగ్గు చూపకూడదన్నారు. యువత, విద్యార్థులు బెట్టింగ్ జోలికి వెళ్లకుండా చదువుపై దృష్టి సారించి తమ తల్లిదండ్రుల కోసం ఉన్నతంగా జీవించాలని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా అభివృద్ధి చెందడం కోసం బెట్టింగ్ రాయుళ్ళ వలలో పడకుండా అప్రమత్తంగా వుండాలని జిల్లా ఎస్‌పి సూచించారు. ఎవరైనా డబ్బు ఆశ చూపించి క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడినా, నిర్వహించినా, ప్రోత్సహించినా ఉపేక్షించబోమన్నారు. బెట్టింగ్ వెబ్‌సైట్, యాప్స్‌పై నిఘా వేశామన్నారు. జిల్లాలో ఎక్కడైనా క్రికెట్ బెట్టింగ్ జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే డయల్ 100, 112కు లేదా సంబంధిత పోలీసుస్టేషన్లకు సమాచారం ఇవ్వాలని జిల్లా ఎస్‌పి విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా వుంచడం జరుగుతుందన్నారు. సమాచారం ఆధారంగా క్రికెట్ బెట్టింగులపై చట్టపరమైన చర్యలకు ఉపక్రమిస్తామని జిల్లా ఎస్‌పి పేర్కొన్నారు.

కార్మిక వర్గంపై ముప్పేట దాడి ఇది సహించ రానిది....

- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్ మండిపాటు

అనంతపురం, మార్చి 22 ప్రభాతవార్తబ్యూరో

నినాదాలు చేస్తున్న నాయకులు

కాయ కష్టం చేసి చమటోడ్చి పనిచేసే కార్మిక వర్గంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముప్పేట దాడి చేస్తున్నాయని ఇది సహించరానిదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్ ప్రభుత్వాల పై మండి పడ్డాడు. శనివారం అనంతపురం మండలంలోని మన్నీల గ్రామం సమీపాన శ్రీకృష్ణాగార్డెన్స్‌లో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రాజారెడ్డి అధ్యక్షతన ఎఐటియుసి ఆధ్వర్యంలో రాజకీయ శిక్షణ తరగతుల ప్రారంభోత్సవం కార్యక్రమానికి హాజరై జగదీష్ ముందుగా ఎఐటియుసి జెండా ఆవిష్కరించి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నాయని ఉత్పత్తి పెంచి పెట్టుబడిదారులకు, యాజమాన్యాలకు లాభాలను తెచ్చే కార్మికుల పైనే ఉక్కు పాదం మోపి, ముప్పేట దాడి చేయడం సమంజసం కాదన్నారు. సమాజంలో కార్మికులను చిన్నచూపు చూస్తున్నారని కొన్ని మీడియా సంస్థలు కూడా కార్పొరేట్ సంస్థలకు వంత పాడుతున్నాయని ఆవేదన చెందారు. కార్మికులు గొంతెమ్మ కోరికలు కోరుతున్నారంటూ విష ప్రచారం చేస్తున్నారని తక్కువ వేతనానికి పనిచేస్తున్న వారికి మెరుగైన జీవనం కల్పించడంలో యాజమాన్యాలు చొరవ చూపడం లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నీ టిని ప్రైవేటుపరం చేస్తూ ఆదాని, అంబానీలకు దేశ సంపదను దోచిపెట్టరన్నారు. లేబర్‌కోడ్, ఈడి, ఎలక్షన్ కమిషన్, సిఐడి సంస్థలు అన్నింటిని కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మార్చడం మోడీ నైజంగా మారిందన్నారు. కోర్టులను సైతం ప్రభావితం చేసి మోడీ కార్మికుల హక్కులను హరిస్తున్నారన్నారు. అనంతపురం సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ మాట్లాడుతూ.. కార్మిక చట్టాల రూప శిల్పి ఎఐటియుసి అని సమాజం కోసం పోరాటం చేయడంలో నిరంతరము అగ్రభాగాన ఉందన్నారు. శ్రీ సత్య సాయి జిల్లా సిపిఐ కార్యదర్శి ఎం. వేమయ్య యాదవ్ మాట్లాడుతూ ప్రస్తుతం నిర్మాణాత్మకమైన పోరాటాలు చేయడంలో ఎఐటియుసి కార్మిక సంఘం దేశములో బలంగా ఉందనీ వేమయ్య పేర్కొన్నారు. అనంతపురం జిల్లా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు పి.నారాయణస్వామి, సి.మల్లికార్జున మాట్లాడారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఏఐటియుసి రాష్ట్రకార్యనిర్వహణకార్యదర్శి చలసాని రామారావు, ఏఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగ సుబ్బారెడ్డి, సిపిఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి నరసింహులు అభ్యుదయ వాది ప్రొఫెసర్ రాజశేఖర్, జిల్లా సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యులు శ్రీరాములు, రామకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు లింగమయ్య, పద్మావతమ్మ,ఏఐవైఎఫ్ రాష్ట్రఆర్గనైజింగ్‌కార్యదర్శి జి.సంతోష్ కుమార్, గిరిజన సమైక్య రాష్ట్ర నాయకులు రామాంజనేయులు వేదికపై ఆసీనులైనారు. శిక్షణా తరగతుల ప్రారంభానికి ముందు జిల్లా ఎఐటియుసి అధ్యక్షులు ఎస్.రాజేష్ గౌడు అతిథులను వేదికపైకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం సిపిఐ నగర సహాయ కార్యదర్శి అలిపిరా, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు పార్వతి ప్రసాద్, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి వి.కృష్ణుడు, నగర అధ్యక్షులు జి.చిరంజీవి, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు సిరాజు, ఆటో యూనియన్ నగర అధ్యక్ష కార్యదర్శులు దుర్గాప్రసాద్ కృష్ణనాయక్, సత్యసాయి జిల్లా మున్సిపల్ యూనియన్ నాయకులు సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు రోజు రాత్రే హుండీలోకి నగల మూట..!

- తాజాగా వెలుగులోకి వచ్చిన సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలు

ఉరవకొండ, మార్చి 22 ప్రభాతవార్త

మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళంలో